జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి ఆదివారం 8 జూన్ 2025 సంపుటి : 15 సంచిక : 267 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.


అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

# కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుదాం

- ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు క్లాస్
- ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలి
- వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దు, పనితీరు మెరుగుపరుచుకోవాలి
- జూన్ 12వ తేదీన అమరావతిలో 2 వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం
- ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలి
- పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి



**అమరావతి**

కూటమిపై ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపించారని.. ఎమ్మెల్యేలు అందరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోవద్దని, పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్నిపెంచే విధంగా ఎమ్మెల్యేలు వ్యవహరించాలని కోరారు. శనివారం తెలుగుదేశం కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలతో అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి - మిగతా3లో



# పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- ఏపీలో పెట్టుబడులకు 'కిటెక్స్ గార్మెంట్' ఆసక్తి
- త్వరలోనే సీఎం చంద్రబాబుతో కంపెనీ ప్రతినిధుల భేటీ
- ఏపీ పెట్టుబడులకు అనువైన ప్రాంతం
- 10 నెలల కాలంలోనే రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడుల రాక
- కేరళలోని కంపెనీ ప్రధాన కార్యాలయం సందర్శన





# మహారాష్ట్ర తరహాలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ
- రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి 2024 మహారాష్ట్ర ఎన్నికలు బ్లూప్రింట్
- ఆ రిగ్గింగ్ ఎలా జరిగిందో ఈ ఆర్టికల్‌లో తెలుస్తుంది
- త్వరలో బీహార్ ఎన్నికల్లో జరుగ బోతోంది
- మ్యాచ్ ఫిక్స్ ఎన్నికలు ఏ ప్రజాస్వామ్య దేశానికైనా విషం లాంటింది



# ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్

- కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు యోచన
- అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు
- ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్..





# తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దు

- 500 రూపాయల నోట్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం లేదు
- ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి
- వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది'



# ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోలు మృతి
- తెలుగు నేతలే టార్గెట్‌గా ఆపరేషన్
- ఘటన స్థలంలో రెండు ఏకే 47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం
- ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి

# ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి

- కాగ్ లెక్కలతో వైఎస్ జగన్ ట్వీట్
- కూటమి ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయి
- 2024 ఏప్రిల్‌తో పోల్చితే 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆదాయం ఏకంగా 24.20 శాతం తగ్గింది.
- ఈ వాస్తవాలను కాగ్ నివేదిక బయట పెట్టగానే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించింది.
- ఏప్రిల్ విషయాలు చెప్పకుండా మే నెలలో జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో పెరుగుతాయంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది







# ఏపీ చరిత్రలో తొలిసారిగా... ఒకేసారి 4,851 మందికి ప్రమోషన్లు

- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకతకు ప్రభుత్వ ప్రాధాన్యం

ఆన్‌లైన్ విధానంపై వదంతులు నమ్మవద్దని విద్యాశాఖ స్పష్టీకరణ

ఈ ఏడాది ఇప్పటికే 35,235 బదిలీలు, 4,853 ప్రమోషన్లు పూర్తి

టీచర్లకు వెసులుబాటుగా పలు నూతన సాంకేతిక సౌకర్యాల కల్పన

# పార్టీలోకి వచ్చేవారిపై పూర్తిస్థాయి విచారణ



కొత్తగా పార్టీలో చేరికలపై టీడీపీ రాష్ట్ర చీఫ్ పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు

టీడీపీలో కొత్త చేరికలపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచనలు

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే ఈ మార్పులని వెల్లడి

ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి

అన్ని స్థాయిల నాయకులు ఈ సూచనలు పాటించాల్సిందేనని స్పష్టీకరణ

# మహిళలను కించపరిస్తే సహించం..



- లోకేష్ స్ట్రాంగ్ వార్నింగ్
- మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం
- మహిళలను ఇంత ఘోరంగా మీడియా సాక్షిలో అవమానిస్తారా
- అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం దిగజారుడుతనానికి పరాకాష్ట



# థియేటర్ల బంద్‌పై ఎలాంటి ప్రకటన చేయలేదు

- బంద్ అంశాన్ని వారే వివాదాస్పదం చేశారు: శ్రీధర్
- థియేటర్ల బంద్ వెనుక నలుగురున్నారు.. త్వరలో పేర్లు వెల్లడిస్తామన్న కార్యదర్శి
- హీరోలు సినిమాలు తగ్గించడం వల్లే సింగిల్ స్క్రీన్లకు కష్టాలు అన్న శ్రీధర్
- ఈ ఏడాది ఇప్పటిదాకా మూడు సినిమాలే హిట్ అయ్యాయని ఆవేదన
- తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ థియేటర్ల బంద్‌పై ఎలాంటి ప్రకటన చేయల

# ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్



**ఛత్తీస్‌గఢ్:** బీజాపూర్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రత బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. తెలుగు నేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కొనసాగుతుంది. మూడో రోజు మరో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటన స్థలంలో రెండు ఏకే 47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో మూడు రోజులుగా మావోయిస్టులకు, భద్రత బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. భద్రత బలగాల హిట్ లిస్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన కీలక నేతలు బండి ప్రకాష్, దామోదర్, మల్లోజుల వేణుగోపాల్, రామన్న, వాసుదేవరావు ఉన్నారు. మరోవైపు మావో కీలక నేతలు బండి ప్రకాష్ , దిలీప్‌లకు ప్రాణహాని ఉందని పౌర హక్కుల సంఘాల నేతలు అంటున్నారు. ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రమాదం ఉందని పౌర హక్కుల సంఘం నేతలు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు నంబాల కేశవరావు, సుధాకర్ ప్రాణాలు కోల్పోయారు. నిన్న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన మైలారపు ఆడేళ్లు అలియాస్ భాస్కర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 5 నుంచి జరుగుతున్న ఎదురు కాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు సహా పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో సెర్చింగ్ జరుగుతుంది. పాము కాటు, తేనెటీగల దాడిలో కొందరు జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. డీహైడ్రేషన్‌తో మరి కొందరు జవాన్లకు అస్వస్థతకు గురయ్యారు. బలగాల ఆపరేషన్ ముగిసిన తర్వాత సమగ్ర సమాచారం తెలియ చేస్తామని బీజాపూర్ ఎస్పీ పేర్కొన్నారు.

# సింధూ జలాల ఒప్పందం పునరుద్ధరించండి

## భారత్‌ను అభ్యర్తిస్తూ నాలుగు లేఖలు రాసిన పాకిస్థాన్



**న్యూఢిల్లీ :** పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందంపై పునరాలోచన చేయాలని పాకిస్థాన్ కోరుతోంది. ఇప్పటికే ఇండియాకు నాలుగు లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. సింధూ నదికి చెందిన నీళ్లు ఇండియా అడ్డుకున్న నేపథ్యంలో.. పాకిస్థాన్‌లో నీటి సంక్షోభం మొదలైనట్లు కొన్ని వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తూ సింధూర్ ఆపరేషన్ చేపట్టిన తర్వాత కూడా ఇండస్ వాటర్ ట్రీటీపై పాకిస్థాన్ లేఖ రాసినట్లు చెబుతున్నారు. ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే విధానంగా ఉండడం కుదరదని ఇండియా తేల్చింది. రక్తం, నీళ్లు కూడా ఒకే చోట ప్రవహించదన్నారు. సిందూ జలాల ఒప్పందాన్ని పరస్పర విశ్వాసం, స్నేహం ఆధారంగా రూపొందించారు. కానీ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్ చర్యలను భారత్ ఖండిస్తోంది. పాకిస్థాన్ నీటి వనరుల శాఖ కార్యదర్శి సయ్యిద్ అలీ ముర్తాజా ఆ లేఖలను .. కేంద్ర జలశక్తి మంత్రిత్వ కార్యాలయానికి పంపినట్లు స్పష్టం అవుతున్నది. ఆ లేఖను మళ్లీ విదేశాంగ కార్యాలయానికి పంపారు. నీటి సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ఆకలితో చస్తామని, సింధూ పరివాహక ప్రాంతం తమకు జీవాధారం అని, మూడో వంతు నీళ్లు తమకు దేశం బయటి నుంచి వస్తోందని, సిందూ బేసిన్‌పై 10లో 9 మంది ఆధారపడుతారని, 90 శాతం పంటలు ఆ జలాలపైనే ఆధారపడుతాయని, పవర్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు అన్నీ సింధూ నదిపైనే కట్టారని, మాపై వాటర్ బాంబు పడినట్లు ఉందని, దాన్ని త్వరగా డిఫ్యూజ్ చేయాలని ఇటీవల పాకిస్థాన్ సేనేటర్ సయ్యిద్ అలీ జాఫర్ తెలిపారు. సింధూ, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లజ్ నదులకు చెందిన నీటిని వాడుకునేందుకు 1960లో ఇండస్ వాటర్ ట్రీటీని ఏర్పర్చుకున్నారు.

# బీజేపీ తదుపరి అధ్యక్షుడు.. ఆ ముగ్గురిలో ఎవరు?



**న్యూఢిల్లీ:** దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పుడు పార్టీ తదుపరి జాతీయ అధ్యక్షుని ఎంపికపై దృష్టి సారించింది. దీనిపై పార్టీ అధికారికంగా ఎటువంటి ?ప్రకటన చేయనప్పటికీ, అధ్యక్షుని ఎంపిక విషయమై అంతర్గత చర్చలు జరుగుతున్నాయని సమాచారం. వచ్చే జూన్ మధ్య నాటికి దీనిపై అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుందని బీజేపీ వర్గాలు సూచనప్రాయంగా చెబుతున్నాయి. మీడియాకు అందిన వివరాల ప్రకారం బీజేపీ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసింది. తదుపరి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ముందు పార్టీ రాజ్యాంగం ప్రకారం అవసరమైన ముందస్తు షరతును ఇప్పటికే నెరవేర్చింది. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల 70 మంది జిల్లా అధ్యక్షులను ప్రకటించిన తర్వాత కేంద్ర నాయకత్వం త్వరలోనే బీజేపీ చీఫ్ పదవిపై నిర్ణయం తీసుకోవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో చోటుచేసుకున్న ఉగ్ర దాడి నేపథ్యంలో ఈ ప్రక్రియ కొంతకాలం ఆలస్యం జరిగిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి రేసులో ముఖ్యంగా ముగ్గురు నేతలు కనిపిస్తున్నారు. వారిలో ఒడిశాకు చెందిన కీలక ఓబీసీ నేత, కేంద్ర నాయకత్వానికి సన్ని హితునిగా పేరుగాంచిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒకరు. పార్టీ అధ్యక్ష పదవికి రేసులో ముందుగా ఈయన పేరు వినిపిస్తోంది. తరువాత శివరాజ్ సింగ్ చౌహాన్ మరో పోటీదారుగా నిలిచారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న ఆయన, ప్రజా నాయకునిగా పేరుగాంచారు. తదుపరి నేత విషయానికి వస్తే ఇటీవలే హర్యానా ముఖ్యమంత్రి పాత్ర నుండి కేంద్ర మంత్రివర్గానికి వెళ్లిన మనోహర్ లాల్ ఖట్టర్. ఈయనకు అపారమైన పరిపాలనా అనుభవం ఉందంటారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి ఈయన పేరును కూడా హైకమాండ్ పరిశీలిస్తోందని సమాచారం. అయితే ప్రాంతీయ ప్రాతినిధ్యం, కుల సమీకరణల ఆధారంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2020 జనవరి నుండి ఈ పదవిలో కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వరకు పార్టీని నడిపించేందుకు ఆయన పదవీకాలాన్ని పొడిగించారు.

# జనగణన ఆలస్యం కేంద్రం పన్నుతున్న దుష్ట పన్నాగమే: స్టాలిన్



**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో జనాభా లెక్కింపు 2027 మార్చి 1 నుంచి జరగనుందని కేంద్ర అధికార వర్గాలు ఇటీవల వెల్లడించాయి. దీంతోపాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. ఈవిషయంపై తమిళనాడు సీఎం ఎంకే. స్టాలిన్ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని లెక్కలు వేసుకొని కావాలనే జనగణన, నియోజకవర్గాల పునర్విభజనను ఆలస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. జనగణన ఆలస్యం దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం పన్నుతున్న దుష్టపన్నాగమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల హక్కులను నిర్వీర్యం చేస్తోందని స్టాలిన్ విమర్శించారు. జనగణన ఆలస్యం అప్పటికప్పుడు తీసుకొన్న నిర్ణయం కాదని.. నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళిక యాదృచ్ఛికం కాదని వ్యాఖ్యానించారు. పునర్విభజన వల్ల ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య కొనసాగినా.. 848కి పెంచినా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందని పునరుద్ఘాటించారు. ఇది తమిళనాడుకు మాత్రమే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాల డిమాండ్లను పరిష్కరిస్తామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించినప్పటికీ అవి అస్పష్టమైన వ్యాఖ్యలుగానే మిగిలిపోయాయని స్టాలిన్ అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని అక్కడి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎన్నిసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ అది కేంద్ర పాలిత ప్రాంతంగానే మిగిలిపోయిందని అన్నారు. కశ్మీర్‌లో ఎన్నికలు జరిగినా, రాష్ట్ర హోదా విషయంలో సుప్రీంలో హామీలు ఇచ్చినా ఏమీ లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

## మహారాష్ట్ర తరహాలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్

**న్యూఢిల్లీ :** గత ఏడాది నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదే తరహాలో ఈ ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రాహుల్ ఇవాళ ఓ పోస్టు పెట్టారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల రిగ్గింగ్‌పై రాహుల్ రాసిన కథనాన్ని ఓ పత్రికలో పోస్టు చేశారు. ఆ పత్రిక రిపోర్టును ఆయన తన ఎక్స్‌లో పోస్టు చేశారు. రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి 2024 మహారాష్ట్ర ఎన్నికలు బ్లూప్రింట్ అని, ఆ రిగ్గింగ్ ఎలా జరిగిందో ఈ ఆర్టికల్‌లో తెలుస్తుందని రాహుల్ వెల్లడించారు.అయిదు దశల్లో రిగ్గింగ్ జరుగుతుందని తన కథనంలో రాహుల్ తెలిపారు. తొలి దశలో ఎన్నికల సంఘంలో రిగ్గింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఎలక్టోరల్ రోల్‌కు నకిలీ ఓటర్లను జోడిస్తారన్నారు. ఆ తర్వాత బోగస్ ఓట్ల ఆధారంగా బీజేపీ గెలుస్తుందన్నారు. ఆధారాలను దాచిపెడుతారని చెప్పారు. రిగ్గింగ్‌ను మ్యాచ్ ఫిక్సింగ్‌తో పోల్చారు. చీటింగ్ చేసిన పార్టీ గెలుస్తుందని, కానీ దాని వల్ల వ్యవస్థలన్నీ నష్టపోతాయన్నారు. ప్రజల్లో విశ్వాసం నాశనం అవుతుందన్నారు. మహారాష్ట్రలో జరిగిన మ్యాచ్ ఫిక్సింగ్ .. త్వరలో బీహార్ ఎన్నికల్లో జరుగ బోతోందన్నారు. మ్యాచ్ ఫిక్స్ ఎన్నికలు ఏ ప్రజాస్వామ్య దేశానికైనా విషం లాంటిందన్నారు.288 స్థానాలు ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీలో.. బీజేపీ 132, శివసేన షిండే 57, ఎన్‌సీపీ 41, కాంగ్రెస్ 16, శివసేన ఉద్ధవ్ 20, ఎన్సీపీ శరద్ పవార్ ఫ్యాక్షన్‌కు 10 సీట్లు దక్కాయి. అత్యధిక సీట్లు బీజేపీకి దక్కాయి. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఎన్నికల సంఘాన్ని అవమానిస్తున్నట్లుగా ఉన్నాయని బీజేపీ ఆరోపించింది.

## ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎలాన్ మస్క్



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. నిన్నమొన్నటి వరకు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ ఇద్దరూ ఇప్పుడు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవలే డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం వీరి మధ్య విభేదాలు కొత్త చర్చకు దారి తీశాయి.ట్రంప్‌తో విభేదాల వేళ ఎలాన్ మస్క్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి మస్క్ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మధ్య వయస్కుల్లో 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా..? అంటూ తనకున్న 20 కోట్ల మందికి పైగా ఫాలోవర్లను ప్రశ్నించారు. దీని కోసం పోల్ పెట్టారు. ఆసక్తికరంగా 80శాతం మంది దీనికి అనుకూలంగా ఓటు వేశారు.

## బాధితులతో దుష్టులు సమానం కాదు.. పాక్‌పై జైశంకర్ ధ్వజం



**ఇంటర్నెట్ డెస్క్:** భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. దుష్టులు బాధితులతో సమానం కాదని.. భారత్ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సహించబోదని అన్నారు. బ్రిటన్ విదేశాంగశాఖ మంత్రి డేవిడ్ లామీతో ఆయన దిల్లీలో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిటన్ ప్రభుత్వానికి జైశంకర్ ధన్యవాదాలు తెలిపారు. “ఉగ్రవాదాన్ని మేం ఎన్నటికీ సహించబోం. ఉగ్రవాదాన్ని సహించకూడదనే విధానాన్ని భారత్ అనుసరిస్తోంది. చెడుకు పాల్పడే వారిని, దానివల్ల బాధితులయ్యే వారిని సమానంగా చూస్తామంటే మేం ఎన్నటికీ అంగీకరించబోం. ఇది మా భాగస్వామ్య దేశాలు కూడా అర్థం చేసుకోవాలని ఆశిస్తున్నాం” అని జై శంకర్ అన్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యపరమైన చర్చలు జరిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఇదిలాఉండగా.. పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. భారత్‌కు మద్దతు ప్రకటించాయి. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపాయి. ఈ ఘటన తర్వాత భారత్ ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌పై దాడులు చేసింది. కాల్పుల విరమణ అనంతరం పాకిస్థాన్ ప్రాయోజిత తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాలకు వివరించడానికి అఖిలపక్ష బృందాలు ఆయా దేశాలకు వెళ్లిన సంగతి తెలిసిందే.

## తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దు




**న్యూ ఢిల్లీ :** ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది’ అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది.రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించు కుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.‘కాపిటల్ టీవీ’ అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తాజాగా స్పందించింది. ‘కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

# పెట్టుబడులకు ఏపీ అనుకూలం

**అమరావతి :** టెక్స్ టైల్స్ రంగంలో ప్రపంచ శ్రేణి దిగ్గజ కంపెనీ కిటెక్స్ గార్మెంట్స్ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలోనే సీఎం చంద్రబాబుతో కంపెనీ యాజమాన్యం భేటీ కానుందని వెల్లడించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి సవిత శనివారం సందర్శించారు. అక్కడ తయారవుతున్న దుస్తులను పరిశీలించి, ఉద్యోగులతోనూ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిటెక్ గార్మెంట్స్ చైర్మన్ సాబు జాకబ్ తో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరవాత ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గంగా మారిందన్నారు. కేవలం పది నెలల కాలంలో రూ.9.70 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఏపీకి తరలొచ్చాయన్నారు. పీఎం నరేంద్రమోడి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలిస్తోందన్నారు. పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్, నీటి సౌకర్యం సహా అన్ని మౌలిక వసతులు కల్పనకు తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా ఏపీలో చేనేత రంగం అభివృద్ధి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇటీవలే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేరళలలో పెట్టుబడుదారులతో సమావేశమవుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా కిటెక్స్ యాజమాన్యంతో భేటీ అయినట్లు మంత్రి సవిత వెల్లడించారు. సత్యసాయి జిల్లాలో కిటెక్స్ గార్మెంట్స్ ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సమీపంలో బెంగుళూరు విమానాశ్రయంతో పాటు కృష్ణపట్నం పోర్టు, రైల్వే కనెక్టవిటీ కూడా ఉందని, దీనివల్ల ఉత్పత్తుల ఎగుమతులు ఎంతో అవకాశముందన్నారు. కర్నూల్ లో పత్తి ఎక్కువగా ఉత్పత్తవుతోందని, కిటెక్స్ గార్మెంట్స్ కావాల్సిన రా మెటీరియల్ అక్కడి నుంచే



సరఫరా చేయొచ్చునని మంత్రి సవిత వెల్లడించారు.

**కిటెక్స్ నిర్వహణ భేష్**

కిటెక్స్ గార్మెంట్ నిర్వహణపై మంత్రి సవిత సంతృప్తి వ్యక్తంచేశారు. లాభార్జనతో కాకుండా నైతిక విలువలతో వ్యాపార నిర్వహణ చేస్తోందన్నారు. 15 వేల మంది ఉద్యోగులను కుటుంబ సభ్యుల్లా గౌరవిస్తుండడంపై కిటెక్స్ యాజమాన్యాన్ని కొనియడారు. చేనేత రంగంలో కేరళలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థగా నిలిచిందన్నారు. దుస్తుల తయారీలో ప్రపంచంలో రెండో అతిపెద్ద సంస్థగా కిటెక్స్ గుర్తింపు పొందిందన్నారు. ఇటీవలే తెలంగాణాలో కిటెక్స్ రూ.3,600 కోట్లు పెట్టుబడులు పెట్టిందని, ఆ రాష్ట్ర టెక్స్ టైల్స్ ఉత్పత్తిలో 15 శాతం వాటా ఈ సంస్థదేనని మంత్రి సవిత వెల్లడించారు.

**ఏపీలో కిటెక్స్ పెట్టుబడులపై హర్షం**

ఏపీలోనూ కిటెక్స్ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేస్తూ, సంస్థ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో సీఎం చంద్రబాబుతో భేటీకి ఏర్పాటు చేస్తామన్నారు. సీఎంతో భేటీలో తమ పెట్టుబడి ప్రణాళికలను కిటెక్స్ యాజమాన్యం వివరించనుందన్నారు. ప్రపంచ శ్రేణి సంస్థ కిటెక్స్ గార్మెంట్స్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టంచేశారు. అంతకుముందు మంత్రి సవిత కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆమెతో పాటు ఆ సంస్థ ఎండీ సాబు జాకబ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## థియేటర్ల బంద్‌పై ఎలాంటి ప్రకటన చేయలేదు..

దని, అలాగే తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌కు ఎలాంటి లేఖ రాయలేదని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యదర్శి శ్రీధర్ స్పష్టం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ నూతన కార్యదర్శిగా శ్రీధర్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు జరిగిన సన్మానం సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ఇటీవల థియేటర్ల బంద్ అంశాన్ని ఇద్దరు దర్శకులు, మరో ఇద్దరు నిర్మాతలు అనవసరంగా వివాదాస్పదం చేశారని ఆరోపించారు. వారి పేర్లను త్వరలోనే వెల్లడించి, తగిన 'రిటర్న్ గిఫ్ట్' ఇస్తామని హెచ్చరించారు. హీరోలు రెండేళ్లకో సినిమా చేస్తుండటంతో సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇటీవల సికింద్రాబాద్‌లోనే ఆరు థియేటర్లు మూతపడ్డాయి. జనవరి నుంచి ఇప్పటివరకు 'సంక్రాంతి వస్తున్నాం', 'మ్యాడ్ స్క్వేర్', 'కోర్టు' చిత్రాలు మాత్రమే విజయం సాధించాయి. ఇలాగైతే మేం ఎలా బతకాలి?" అని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ సినిమా కోసం థియేటర్లను ఖాళీగా ఉంచితే, ఆ సినిమా వాయిదా పడిందని, దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. "అనవసరంగా సింగిల్ స్క్రీన్లను బదనాం చేస్తున్నారు. హీరోలకు స్టార్ హోదా ఎక్కడి నుంచి వచ్చింది? ఒకప్పుడు హీరోలు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేసేవారు. ఇప్పుడు ఒక్కో హీరో ఏడాదికి ఒక్క సినిమా కూడా చేయడం లేదు. రూ.10 లక్షలు తీసుకునే హీరోకి తర్వాతి సినిమాకు రూ.30 లక్షలు ఇస్తున్నారు. ఇటీవల విడుదలైన ఓ సినిమా డిజాస్టర్ అయితే, ఆ హీరోని పిలిచి రూ.13 కోట్ల రెమ్యునరేషన్ ఇచ్చారు" అని శ్రీధర్ ఆరోపించారు.

థియేటర్లు తమ ఆస్తులని, వాటిని తాము ఏమైనా చేసుకుంటామని అన్నారు. "థియేటర్లు ఉన్నవాళ్లమంతా ఒకే గొడుగు కిందకు వచ్చాం. మా గ్రూపును చూసి ఎగ్జిబిటర్ వస్తే నాలుగు డబ్బులు దొరుకుతాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లను కూడా మల్టీప్లెక్స్ తరహాలోనే నిర్వహిస్తున్నాం. ప్రేక్షకుడికి తక్కువ ధరతో పాటు, 80 రూపాయలకే పాప్ కార్న్, 30 రూపాయలకే కూల్‌డ్రింక్ అందిస్తున్నాం" అని ఆయన వివరించారు.

## పార్టీలోకి వచ్చేవారిపై పూర్తిస్థాయి విచారణ

తెలుగుదేశం పార్టీలో ఇతర పార్టీల నుంచి గానీ, కొత్తగా గానీ సభ్యులను చేర్చుకునే ప్రక్రియకు సంబంధించి పార్టీ రాష్ట్ర శాఖ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ కొత్త నిబంధనలను రూపొందించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఇకపై పార్టీలోకి ఎవరిని చేర్చుకోవాలన్నా నిర్దేశిత పద్ధతులను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పల్లా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీలో చేరతామని ఆసక్తి చూపే వ్యక్తుల గురించి ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి తప్పనిసరిగా తెలియజేయాలని ఆయన సూచించారు. వారి నేపథ్యం, వివరాలపై సమగ్రంగా విచారణ జరిపిన తర్వాతే వారిని పార్టీలోకి ఆహ్వానించే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు ఉండకూడదని, ప్రతి చేరిక కూడా పార్టీ నియమావళికి అనుగుణంగానే జరగాలని ఆయన నొక్కిచెప్పారు. పార్టీలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులందరూ ఈ సూచనలను గమనించి, తు.చ. తప్పకుండా పాటించాలని పల్లా శ్రీనివాసరావు తన ప్రకటనలో కోరారు. ఈ నూతన మార్గదర్శకాలతో పార్టీలోకి వచ్చేవారి విషయంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## మహిళలను కించపరిస్తే సహించం..

**అమరావతి :** అమరావతి దేవతల రాజధాని కాదు అది వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను మంత్రి నారా లోకేష్ తీవ్రంగా తప్పు బట్టారు. అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి మీడియాలో వచ్చిన వార్తలపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి స్పందించారు. రాజధాని మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమంటూ హెచ్చరించారు. మహిళలను ఇంత ఘోరంగా అవమానిస్తారా అంటూ విరుచుకుపడ్డారు. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే అంటూ మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

**లోకేష్ ట్వీట్**

మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమన్నారు. మహిళలను ఇంత ఘోరంగా మీడియా సాక్షిలో అవమానిస్తారా జగన్ అంటూ ప్రశ్నించారు. అమ్మల ఆత్మాభిమానం మీద, అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం దిగజారుడుతనానికి పరాకాష్ట అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆకాశంపై ఉమ్మేయాలనుకుంటే, అది మీ మీదే పడుతుందన్నారు. అమరావతిపై విషం చిమ్మాలనుకుంటే అది తాడేపల్లి ప్యాలెస్‌లో పడుతుందని తెలిపారు. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే అంటూ మరోసారి స్పష్టం చేశారు. భూములను త్యాగాలు చేసిన అమ్మల అమరావతి అని అన్నారు. మూడు రాజధానుల కపట కుట్ర పొత్తిళ్లలో తంతుంటే, జై అమరావతి అని నినదించిన శాంతమూర్తుల పవిత్ర భూమి రాజధాని అని చెప్పుకొచ్చారు.

## ఏపీ చరిత్రలో తొలిసారిగా...

## ఒకేసారి 4,851 మందికి ప్రమోషన్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి, పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా, కేవలం సర్వీసునే ప్రామాణికంగా తీసుకుంటున్న ఈ ఆన్‌లైన్ విధానంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు స్పష్టం చేసింది. పైరవీలకు, రాజకీయ జోక్యానికి ఆస్కారం లేదని భరోసా ఇచ్చింది. ఈ ఏడాది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా, ఎటువంటి రాజకీయ ప్రమేయానికి తావులేకుండా ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాలతో పలు దఫాలుగా చర్చించి, వారి సూచనలు పరిగణనలోకి తీసుకుని, ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం "టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని బదిలీలను కేవలం ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆన్‌లైన్ బదిలీల్లో ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం పలు నూతన సాంకేతిక సౌకర్యాలు ప్రవేశపెట్టారు. మండల కేంద్రం నుంచి పాఠశాల దూరం, క్లస్టర్లలో ఖాళీల వివరాలు స్పష్టంగా చూపుతున్నారు. ఆప్షన్లను పలుమార్లు మార్చుకునే వీలు, అవగాహన వీడియోలు, సాంకేతిక సందేహాల నివృత్తికి సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు తమ ఆప్షన్లను ఖచ్చితంగా ఖరారు చేయాల్సి ఉంటుంది

## కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుదాం..

-మొదటిపేజీ తరువాయి

వచ్చి ఏడాదైనా సందర్భంగా జూన్ 12వ తేదీన అమరావతిలో 2 వేలమందితో ఓ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ తర్వాత కూడా ఏపీవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఎమ్మెల్యేలు ఎవరెవరు ఏం చేస్తున్నారనే సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీలో ఉన్న పరిస్థితులు కూడా ప్రజలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. 2024 జూన్‌కి ముందు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని గుర్తుచేశారు. తాను నాలుగోసారి సీఎం అయ్యానని.. కానీ ఇలాంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదని వెల్లడించారు సీఎం చంద్రబాబు. అయినా ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. మనం రాష్ట్ర సంక్షేమం కోసం యజ్ఞం చేస్తుంటే రాక్షసులు కొంతమంది భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఏపీలో గతంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేదని.. ఇప్పుడు కంట్రోల్ చేస్తున్నామని అన్నారు. శాంతి భద్రతలు, గంజాయి, రౌడీయిజాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తామని.. ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహానాడు ఈసారి బాగా జరిగిందని చెప్పారు. వచ్చే నెల నాటికి అన్ని కమిటీలు, రాష్ట్ర కమిటీలను నియామకం పూర్తి చేస్తామని తెలిపారు. యోగా డేను జయప్రదం చేయాలని కోరారు. కార్యకర్తలు యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి.

**తాడేపల్లి:** చంద్రబాబు కూటమి పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారిందన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. కాగ్ నివేదికలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వైఎస్ జగన్ తెలిపారు. కూటమి ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా కాగ్ నివేదికలను బయటపెట్టారు. వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారింది. కాగ్ నివేదికలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా రూ.3,354 కోట్లు ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటన చేసింది. కానీ, ఇది అబద్ధమని కాగ్ నివేదిక వాస్తవ లెక్కలను ప్రకటించింది. 2024 ఏప్రిల్‌తో పోల్చితే 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆదాయం ఏకంగా 24.20 శాతం తగ్గింది. ఈ వాస్తవాలను కాగ్ నివేదిక బయట పెట్టగానే ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించింది. ఏప్రిల్ విషయాలు చెప్పకుండా మే నెలలో జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో పెరుగుతాయంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. సర్దుబాటు కారణంగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.796 కోట్లు తగ్గిందనీ, అందువలన జీఎస్టీ ఆదాయాలు తగ్గాయని ప్రకటించింది. నిజానికి సర్దుబాట్లన్నీ లెక్కించిన తర్వాతనే నికర జీఎస్టీని లెక్కగడతారు. కానీ, జీఎస్టీ ఆదాయాల గురించి కాగ్ నిజాలను వెలుగులోకి తేగానే దాన్ని కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలను చేస్తోంది.

**కాగ్ నివేదికలను బయటపెట్టిన వైఎస్ జగన్**

టీడీపీ ప్రభుత్వం చెప్పేదానికి పూర్తి విరుద్ధంగా కాగ్ నివేదికలు వాస్తవాలను వెల్లడి చేస్తున్నాయి. దాన్ని బట్టి చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మందగమనంలో ఉంది. గతేడాదితో పోల్చితే పన్ను ఆదాయాలు 12.21 శాతం తగ్గాయి. పన్నేతర ఆదాయాలు 22.01 శాతం తగ్గాయి. ఇది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మరింత ఆందోళన కలిగించే అంశం' అని చెప్పుకొచ్చారు.

## 5 లక్షల మందితో యోగా

-మొదటిపేజీ తరువాయి

ఈవెంట్ చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజును భారీ స్థాయిలో యోగా కార్యక్రమాలను చేపట్టనుంది. విశాఖలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నాయి. ఒక్క విశాఖలోనే ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. యోగా మన జీవితంలో భాగం కావాలని? ఆయుష్ ద్వారా యోగాను ప్రతి ఒక్క ఇంటికి చేర్చేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు జరిగే యోగా ప్రదర్శనలో భారీ ఎత్తున ప్రజలు భాగస్వాములవుతారని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో 2 కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే కోటిపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ఇలా?.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగమయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం ముందుగా వెబ్ సైట్ లోకి వెళ్లాలి. ఇక్కడ ఫామ్ అందుబాటులో ఉంటుంది. మీ వివరాలను నమోదు చేయాలి. జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో ఎక్కడ పాల్గొంటారనేది సెలెక్ట్ చేయాలి. ఓటీపీ ప్రాసెస్ తర్వాత? రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

## డ్వాక్రా మహిళలకు లక్ష

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా 4% వడ్డీకే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందిస్తారు. కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. సెర్ప్ ఆధ్వర్యంలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తారు. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా పేరు పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ఇది కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాన్ని పిల్లల చదువు కోసమే ఉపయోగించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయొచ్చు. సాంకేతిక విద్యకు కూడా ఈ డబ్బును ఉపయోగించవచ్చు. ఊరి నుంచి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిల్ కొనుక్కోవడానికి కూడా అనుమతి ఉంది. డబ్బును దేనికోసం ఖర్చు చేశారో రసీదులు స్త్రీనిధి అధికారులకు ఇవ్వాలి.ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు 4% వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకోవచ్చు. పిల్లల చదువుకు భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యనఅభ్యసించవచ్చు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం స్త్రీనిధి డ్వాక్రా సభ్యులకు 11% వడ్డీతో రుణాలు ఇస్తోంది. అయితే, పిల్లల చదువు కోసం వడ్డీ రేటును తగ్గించారు. తల్లిదండ్రులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.డ్వాక్రా మహిళలు రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించవచ్చు. తీసుకున్న మొత్తాన్ని బట్టి కనీసం 24 నెలల నుంచి గరిష్టంగా 36 నెలల వరకు గడువు ఉంటుంది. ఈ పథకం కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల చేతిలో డబ్బులు లేక బయట ఎక్కువ వడ్డీలకు తెచ్చి అప్పులపాలవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. వారికి చేయూతగా నిలిచేందుకు కొత్త పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# అనకాపల్లిలో నేతల ఎత్తులు

**కాకినాడ :** అనకాపల్లిలోనే అసలు కథంతా నడుస్తుంది. ఇక్కడ కూటమి పార్టీలకు చెందిన ముగ్గురు నేతల మధ్య పెద్దగా సఖ్యత లేనట్లు కనిపిస్తుంది. గత ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ఆంధ్రప్రదేశ్ లో పోటీ చేశాయి. అయితే అనకాపల్లి విషయానికి వచ్చే సరికి శాసనభకు జనసేన నుంచి సీనియర్ నేత కొణతాల రామకృష్ణ పోటీ చేశారు. ఇక అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. ఇక టీడీపీ నుంచి కూడా దాడి వీరభద్రరావు వంటి నేత ఉన్నారు. ముగ్గురి నేతల మధ్య మాత్రం సమన్వయం లేనట్లు కనిపిస్తుందంటున్నారు. పార్టీ క్యాడర్ విషయంలోనూ ఒకింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాన్న ఫిర్యాదులు మూడు పార్టీల కేంద్ర కార్యాలయాలకు అందుతున్నట్లు తెలిసింది. విస్తుపోతున్న లీడర్లు ఎంపీగా ఉన్నప్పటికీ... అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా సీఎం రమేష్ కడప నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసి కూటమికి వీచిన హవాతో గెలుపొందారు. ఆయన అనకాపల్లిలోనే పూర్తి స్థాయి రాజకీయాలు కేంద్రీకరించరు. ఆయన అనుచరులు అక్కడ పెత్తనం చేస్తున్నారని చెబుతున్నారు. సీఎం రమేష్ అప్పుడప్పుడు అనకాపల్లికి వస్తున్నప్పుడు మాత్రం అందరినీ కలుస్తూ ఆయన కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు లేకుండానే చేస్తున్నారు. కానీ ఆయన అనుచరులమని చెప్పుకునే కొందరు మాత్రం సీఎం



రమేష్ పేరు చెప్పుకుని కొన్ని పనులు తీసుకోవడంతో పాటు సిఫార్సులు చేయడంలో ముందుండటంతో పాటు పదవుల విషయంలోనూ వారికే ప్రాధాన్యత దక్కుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఇక సీనియర్ నేత కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచారు. గత ఎన్నికలకు ముందు ఆయన వైసీపీలో చేరి టిక్కెట్ తెచ్చుకోగలిగారు. తర్వాత ఆయనకు కేబినెట్ లో చోటు దక్కలేదు. కొణతాల రామకృష్ణ అనకాపల్లి ఎమ్మెల్యే అయినప్పటికీ ఉత్తరాంధ్ర సమస్యలపై గతంలో ఎక్కువ ఫోకస్ పెట్టేవారు. ఉత్తరాంధ్రకు సాగు, నీరు అందించే ప్రాజెక్టును తీసుకు రావాలని కొంతకాలం ఉద్యమాన్ని కూడా నిర్వహించిన కొణతాల ఆయన ఎక్కువగా ఆ ప్రాంత సమస్యలపైనే ఫోకస్ పెట్టారట. అయితే కొణతాల రామకృష్ణ ఎక్కువగా విశాఖపట్నంలో ఉండటంతో అనకాపల్లిలో ఆయన ప్రధాన అనుచరులు హవా కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక పార్టీలు మారిన సీనియర్ నేత దాడి వీరభద్రరావు సయితం తనకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎలాంటి పదవులు రాకపోవడంపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. అందుకు సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ కారణమని ఆయన నమ్ముతున్నారు. సీఎం రమేష్ తో కాకపోయినా కొణతాల తో దాడి వీరభద్రరావు విభేదాలు ఈనాటివి కావు. దాడి వీరభద్రరావు బహిరంగంగానే కొణతాలపై విమర్శలు చేస్తుండటం, పార్టీ పదవులను కూడా టీడీపీ వారికి దక్కకుండా చేస్తున్నారని, చివరకు తమ కుటుంబాన్ని పక్కన పెట్టిన విషయంలోనూ కొణతాల ఉన్నారని దాడి వీరభద్రరావు అనుమానిస్తున్నారు. అందుకే మూడు పార్టీల నేతల మధ్య విభేదాలు అనకాపల్లిలో మూడు ముక్కలాటగాతయారైందంటున్నారు.


## సంపాదకీయం

# లాటిన్ అమెరికా యోధుడు జోస్ ముజికా

ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ 'పెపె' ముజికా 89వ ఏట 2025 మే 13న మరణించారు. అతడి జీవిత సహచరి, ఉద్యమ సహచరి లూసియా టొపోలన్స్కీ గతంలో గెరిల్లా యోధురాలు, సెనేటర్ కూడా. ఒక గెరిల్లా యోధుడి నుండి దేశాధ్యక్షుడి దాకా కొనసాగిన ముజికా జీవనయానం చాలా ప్రత్యేకమైనది. ఏండ్ల తరబడి ఒంటరిగా ఖైదు జీవితాన్ని అనుభవిం చాడు. ఆ తర్వాత ప్రజల హృదయాలను గెలుచుకున్న నేతగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాడు. ఉరుగ్వేలోని మాంటెవిడియో లో ముజికా 1935 మే 20న జన్మించాడు. వాళ్లది ఒక మధ్యతరగతి కుటుంబం. ఎనిమిదేళ్ళకే తండ్రిని పోగొట్టుకున్నాడు ముజికా. దాంతో తన పొట్ట పోసుకోడానికి అన్ని రకాల పనులనూ చేయాల్సి వచ్చింది. రొట్టెలు ఇళ్ళకు సరఫరా చేయడం నుంచి పువ్వులు అమ్మడం వరకూ రకరకాల పనులు చేశాడు. యుక్తవయస్సు వచ్చాక కొద్దికాలం పాటు మధ్యేవాద-మితవాద పార్టీ అయిన నేషనల్ పార్టీలో పని చేశాడు. ఆ పార్టీ రాజకీయాల పట్ల విముఖత ఏర్పడి ప్రత్యామ్నాయ రాజకీయాల అన్వేషణలో పడ్డాడు. 1959లో జరిగిన క్యూబన్ విప్లవం ముజికాను ఎంతో ఉత్తేజితుడిని చేసింది. 1962లో తన 27వయేటా ఇతరులతో కలిసి ముజికా నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్ (ఎం.ఎల్.ఎన్-టి) అనే సంస్థను స్థాపించాడు. అది ఒక గెరిల్లా ఉద్యమం. ఉరుగ్వేలోని నియంతృత్వ ప్రభుత్వాన్ని కూలదోయడమే దాని లక్ష్యం. తన విప్లవ జీవిత కాలంలో ముజికా నాలుగుసార్లు పట్టుబడ్డాడు. ఆరుసార్లు తూటాలు శరీరంలోంచి దూసుకు పోయినా బతికాడు. జైలు నుండి రెండు సార్లు తప్పించు కున్నాడు. దీర్ఘకాలం క్రూరమైన నిర్బంధాన్ని తట్టుకున్నాడు. ఉరుగ్వేలోని సైనిక నియంతృత్వ పాలనలో అతడిని దారుణంగా చిత్రహింసలు పెట్టారు. తన పద్నాలుగేండ్ల జైలు జీవితంలో పదేండ్ల పాటు ఒక లోతైన నూతిలో ఒక్కడే నిర్బంధించబడ్డాడు. 1985లో సైనిక పాలన అంతం కావడంతో గెరిల్లా యోధులం దరికీ క్షమాభిక్ష లభించింది. దాంతో ముజికా బయట పడ్డాడు. విడుదల అనంతరం ముజికా సాయుధ పోరాట మార్గాన్ని విడనాడాడు. ప్రజాతంత్ర రాజకీయాలవైపు మొగ్గు చూపాడు. మూవ్‌మెంట్ ఆఫ్ పాపులర్ పార్టిసిపేషన్ (ఎం.పి.పి) అనే పార్టీని ఇతరులతో కలిసి స్థాపించాడు. అది ఒక విశాల ప్రాతిపదికన ఏర్పడ్డ వామపక్ష సంఘటన. 1994లో ముజికా ఛాంబర్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రజాప్రతినిధుల సభ)కు ఎన్నికయ్యాడు. ఆ తర్వాత సెనేట్‌కు ఎన్నుకోబడ్డాడు. పార్లమెంటులో అతడు ఒక సూత్రబద్ధమైన నాయకుడిగా నిజాయితీగా, నిరాడంబరంగా జీవించే నేతగా గౌరవాన్ని పొందాడు. 2009లో ముజికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. తనకు కేటాయించిన అధ్యక్ష భవనంలో ఉండడానికి తిరస్కరించి దేశ రాజధాని మాంటెవిడియో శివార్లలో తనకున్న చిన్న రేకుల షెడ్డు ఇంటిలోనే ఉండడానికి ఇష్టపడ్డాడు. అధ్యక్షుడిగా తనకు వచ్చే జీతంలో తొంభైశాతం వరకూ దానంగా ఇచ్చేవాడు. "రాజకీయ వేత్తలు తమ ప్రజల మాదిరిగా జీవించాలే తప్ప ప్రత్యేక స్థాయి గల కొద్ది మందిలా ఉండకూడదు" అని చెప్పేవాడు. 2010-15 మధ్య అధ్యక్షుడిగా ఉన్న కాలంలో ఉరుగ్వేను మార్చడానికి ముజికా ఎన్నో చర్యలు చేపట్టాడు. క్రమం తప్పకుండా వేతనాలను పెంచాడు. పేదరికంలో ఉన్న జనాభా సగానికి పైగా దాన్నుంచి బయటపడ్డారు. పేదరికపు రేటు ఏడు శాతానికి తగ్గింది. నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. జీడీపీ సుమారు 5.4 శాతం పెరిగింది. అబార్షన్‌ను చట్టబద్ధం చేయాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌ను ఆమోదించి చట్టం చేశాడు. మరిజువానాపై ప్రభుత్వ నియంత్రణ అమలు చేసి మాదక ద్రవ్య వ్యాపారులకు కళ్లెం వేశాడు. నయా ఉదారవాదం చెప్పే నియమాలకు కట్టుబడకుండా ముజికా తన విధానాలను అమలు చేశాడు. నయా ఉదారవాదానికి, అది పెంచి పోషించే వినిమయతత్వానికి ముజికా బద్ధ వ్యతిరేకి. "ఇంకా ఇంకా ఎక్కువ సంపాదించాలనుకున్న వారే నిజమైన పేదవాళ్లు" అని ముజికా ప్రకటించాడు. పర్యావరణ పరిరక్షణకు, పర్యావరణ హిత అభివృద్ధికి ముజికా కట్టుబడి వ్యవహరించాడు. నేడు ఉరుగ్వే ప్రపంచంలోనే పర్యావరణానికి అత్యంత అంకితభావంతో కట్టుబడిన దేశంగా ఉంది. ఆ దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 98 శాతం బయోమాస్ నుండి, గాలి నుండి, సూర్యుడి నుండి వస్తుంది. ఉరుగ్వే చట్టాల ప్రకారం ఒకసారి అధ్యక్షుడైనవాడు వరుసగా రెండు సార్లు ఆ పదవిలో ఉండకూడదు. ఆ నిబంధనను అనుసరించి ముజికా పదవి నుండి వైదొలగాడు. ఐతే, ఆ సమయానికి 60 శాతం ప్రజానీకం ముజికా విధానాలకు ఆమోద ముద్ర వేశారు. ముజికా 2020 వరకూ సెనేటర్‌గా కొనసాగాడు. జీవితాంతమూ అతడు లాటిన్ అమెరికా ఐక్యతనే కోరుకున్నాడు. లాటిన్ అమెరికా ఖండంలోని తక్కిన వామపక్ష, అభ్యుదయ వాదులందరికీ ముజికా స్ఫూర్తినిచ్చాడు. 2024లో ముజికాకు అన్నవాహిక వద్ద క్యాన్సర్ సోకినట్టు నిర్ధారించారు. తన అనారోగ్యాన్ని లెక్క చేయకుండా ముజికా 2024 ఎన్నికల్లో తమ అభ్యర్థి యమాందు ఒర్సి గెలుపు కోసం ప్రచారం చేశాడు. జనవరి 2025లో ముజికా ఇక తనకు వైద్యం వద్దని తిరస్కరించాడు. "ఒక సైనికుడు ఎప్పుడో ఒకప్పుడు విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు. ముజికా మరణం లాటిన్ అమెరికా లోను, ప్రపంచ ప్రజల్లోను విషాదాన్ని నింపింది. పేదలకు, శ్రామిక వర్గానికి అనుకూలంగా ఉండే రాజకీయాల సమున్నత వారసత్వాన్ని ముజికా మనకి వదలి వెళ్ళాడు. అతడి నిరాడంబరత, ప్రజలతో మమేకం కావడం, అవినీతికి అతీతంగా ఉండడం, న్యాయానికి అచంచలంగా కట్టుబడి వ్యవహరించడం ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. మెక్సికో అధ్యక్షుడు క్లాడియా షీన్‌బామ్ "ముజికా లాటిన్ అమెరికాకు, యావత్ ప్రపంచానికి కూడా ఒక గొప్ప ఉదాహరణ" అన్నారు. చిలీ అధ్యక్షుడు గేబ్రియల్ బోరిక్ "ఇప్పటికన్నా ఇంకా మెరుగుగా చేయవచ్చునన్న తీరని దాహాన్ని మాకు మీరు మిగిల్చి వెళ్లారు. గుండె కొట్టుకుంటున్నంత వరకూ, ప్రపంచంలో అన్యాయం ఉన్నంత వరకూ పోరాటం చేయడం కన్నా గొప్ప పని ఇంకొకటి లేదని మీరు చాటి చెప్పారు" అన్నారు. లాటిన్ అమెరికా నేడు అల్లకల్లోల పరిస్థితుల్లో ఉంది. "ఇప్పటికి చేసినదానికన్నా ఇంకా మెరుగ్గా చేయవచ్చు"నని ముజికా చెప్పినదాన్ని ఆచరించడం పెద్ద సవాలుగా మారింది. గేబ్రియల్ బోరిక్ ప్రభుత్వం చిలీలో చాలా ఎక్కువ అంచనాలతో గెలుపొందింది. కాని ఇప్పుడా ప్రభుత్వం సంక్షోభంలో ఉంది. ప్రజా తీర్పుకు అనుగుణంగా బోరిక్ వ్యవహరించడం లేదని ఎక్కువ మంది భావిస్తున్నారు. రాజ్యాంగ సభ ఒక అభ్యుదయకర రాజ్యాంగాన్ని తయారుచేసింది. కాని దానిని జాతీయ రెఫరెండంలో ప్రజలు తిరస్కరించారు. రెండవ మారు తయారౌచేతున్న ముసాయిదా రాజ్యాంగం పట్ల ప్రజలకు ఏమంత విశ్వాసం కలగడం లేదు.బొలీవియా లోని మూవ్‌మెంట్ ఫర్ సోషలిజం (ఎం.ఎఫ్.ఎస్) లో చీలికలు ఏర్పడ్డాయి. మాజీ దేశాధ్యక్షుడు ఇవో మొరేల్స్‌ను ప్రస్తుత అధ్యక్షుడు లూయిస్ ఆర్సె పక్కనబెట్టాడు. ఆగస్టులో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరగబోతున్నాయి. ఎం.ఎఫ్.ఎస్ తన అభ్యర్థిగా ఎడ్వర్డో దెల్ కాస్టిలోను నిలబెట్టింది. మొరేల్స్ దీనిని సవాలు చేస్తూ నామినేషన్ వేయడానికి తయారౌతున్నాడు, కాని రాజ్యాంగం రెండు సార్లు కన్నా ఎక్కువగా అధ్యక్ష పదవిని చేపట్టకూడదని నిబంధన విధించింది. ఐనా మొరేల్స్ దీన్ని కూడా ధిక్కరిస్తూ స్థానిక ఆదివాసీలను పెద్దఎత్తున సమీకరించి దేశ రాజధానిలో ప్రదర్శన నిర్వహించాడు. దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. బాష్ప వాయువు సైతం ప్రయోగించారు. బొలీవియాలోని వామపక్ష శక్తులు ఇలా చీలిపోవడం తీవ్ర నష్టానికి దారి తీయవచ్చు. ఈక్వెడార్‌లో ఏప్రిల్ 14న జరిగిన ఎన్నికలలో సిటిజెన్ రివల్యూషన్ అభ్యర్థి లూయిసా గొంజాలెజ్ గెలుపు ఖాయమని అందరూ భావించారు. ఎగ్జిట్ పోల్స్ కూడా ఆమెదే గెలుపు అని ప్రకటించాయి. కాని అధికార వ్యవస్థలన్నింటినీ దుర్వినియోగం చేసి మితవాద అభ్యర్థి డేనియల్ నోబోవా గెలిచినట్టు ప్రకటించారు. అక్కడ వామపక్ష శక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. బ్రెజిల్‌లో మితవాద శక్తులు పుంజుకుంటున్నాయి. పచ్చి మితవాది అయిన జైర్ బోల్సనారో ఇప్పటికే ఒకసారి అధ్యక్ష పదవిని నిర్వహించాడు. అక్కడి రాజకీయ పరిస్థితుల్ని బలంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. అర్జెంటినాలో మరో మితవాది అయిన జేవియర్ మిలేయా నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తోంది. ముజికా కాలంలో లాటిన్ అమెరికాలో పలు దేశాల్లో వామపక్ష శక్తుల నాయకత్వంలో ప్రభుత్వాలు నడిచేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అయితే, అంతా అయిపోయిందనుకోడానికి లేదు. కొలంబియా చరిత్రలో మొట్టమొదటిసారి ఒక వామపక్ష అధ్యక్షుడు ఎన్నికయ్యాడు. మెక్సికోలో, హొండురస్‌లో కూడా వామపక్షవాదులే దేశాధ్యక్షులుగా ఉన్నారు.

# సాహితీ వాచస్పతి దాశరథి

తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య- శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన. మూడు కావ్యేతిహాసాలను - శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమ ద్భాగ వతము, వేదాలు - ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఓకే ఒక్కరుగా సంస్కృతం



నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్ళు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు.

తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను - నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూ పమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. 1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు. 1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల ఎవ ఝష్రశీ తీఱఅవం ూా ా ఱఅ్రవతీ' ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు. తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శ్కెలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు. 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

# సముద్ర కాలుష్యాన్ని నివారించాలి

మానవజీవితం నీటితో ముడిపడి ఉన్నది. జీవులు ధ్భవించింది, పరిణ మించింది నీటి ఆధారంగానే. ప్రపంచం మొత్తం మహాసముద్రాల బలం మీదనే ఉందని మనకు ఇప్పటికే తెలుసు, భూమిలో 70 శాతం మహా సముద్రాలు ఉన్నాయి. మహా సముద్రాలు మన జీవితాన్ని మాత్రమే కాకుండా మొత్తం భూమి, పర్యావరణాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. భూమిపై లభించే మొత్తం నీటిలో 97 శాతం మహా సముద్రాలలో ఉంది. మనం ఊపిరి పీల్చు కోవాల్సిన ఆక్సిజన్లో 70 శాతం మహా సముద్రాల ద్వారా ఉత్పత్తి అవుతుంది. జీవుల శరీరములో 70-80 శాతము నీరే ఉంటుంది . సముద్ర సంపదను తన ఆర్థిక ప్రగతికి పునాదిగా మార్చుకున్నాడు మనిషి. నేడు ఒక అంచనా ప్రకారము ప్రపంచ జనాభా లో 25% సముద్రతీర ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. నీరులేనిది జీవుల మనుగడ ఉండదు ... ఏప్రాణీ బ్రతకదు. సాగర జీవసంపద విశేషమైనది. సాగరంలో దొరికే జీవ సంపదలో ప్రధాన స్థానము చేపలదే. తరువాత తాబేళు , తిమింగళాలు, సీల్సు, మున్నగు నవి. సముద్ర తీరాన్ని ఆధారముగా చేసుకొని లభించే పక్షిజాతి అనేకము. ఇవి కాక కోరల్స్, మత్యాల నిచ్చే ఆల్చిప్పలు మున్నగునవి. సముద్రంలో పనికిరాని పదార్థము లేదు. ఆ వైద్యపరంగా వాడుతారు. సముద్రాలలో గ్యాస్ లభిస్తుంది. ప్రపంచ సముద్ర దినోత్సవం ప్రతి ఏటా జూన్ 8న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. సముద్ర రక్షణ గురించి ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. 1992 లో బ్రెజిల్ లోని రియోడి జనీరోలో ధరిత్రి సదస్సు జరిగింది. ఆ సందర్భముగా సముద్రాలమీద అవగాహన పెంచాలని నిర్ణయించారు. నాటి వరకు తుఫాన్ లును మాత్రమే చూసిన తీర ప్రజలకు 2005 లో వచ్చిన సునామీ %%.. అది సృష్టించిన బీభత్సం తర్వాత ఇక సాగర దినోత్సవం ద్వారా సముద్రాల మీద ప్రజల ఆలోచనలను మార్చాల్సిన అవసరము ఉందని తీర్మానించుకున్నారు. 2008 లో ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానం ద్వారా 2009 నుండి ప్రపంచ సాగర దినోత్సవ నిర్వహణ ప్రారంభ మైంది. నాటి నుండి ప్రతియేటా జూన్ 08 న " సముద్ర/ సాగర దినోత్సవం" గా జరుపు కుంటున్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం" మహా సముద్రాలు సంబంధిత విషయాలు, ఆహార భద్రత, జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత, సముద్ర వనరులు వినియోగం, వాతావరణ మార్పు మొదలైన వాటి యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇంటర్నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆర్గనైజేషన్ వారు జలభాగాన్ని మొత్తం ఐదు మహాసముద్రాలు గా విభజించారు. ఐదు మహా సముద్రాలతో కలిసి మొత్తం 100 నుండి 110 సముద్రాలను గుర్తించ వచ్చును. వీటిలో అట్లాంటిక్ లో అత్యధికంగా 40, ఫసిఫిక్ లో 33, ఆర్కిటిక్ లో 17, అంటార్కిటిక్ లో 11, హిందూమహా సముద్రములో 9 ఉ న్నాయి. భూగోళము మీద మూడింట రెండు వంతులు మేర సముద్రము ఆవరించి వుంది. విస్తారమైన ఉప్పునీటి భాగాన్నే సముద్ర మంటారు. మానవులు వినియోగించే అధిక శాతం ప్రోటీన్లు సముద్ర జీవులైన చేపలు, రొయ్యలు మొదలగు మత్స్యసంపద ద్వారా




వస్తున్నదే. వాతావరణంలో మార్పులను మానవ నివాసానికి అనుకూల ముగా మారుస్తున్నది సముద్రాలే. మానవులకు నీటివనరులను అందించే వర్షాలు కురిసేది సముద్ర జలాలు నీరు ఆవిరవడంవలనే. గాలి విస్తున్నది. ఉష్ణోగ్రతను నియంత్రిస్తున్నది సముద్రాలే. మనిషి సహజ వాయువు, ముడి చమురు నిక్షేపాలును సముద్ర గర్భము నుండే పొందుతున్నారు. సముద్ర జీవులను ఆహార, ఔషధ తయారీ లో వినియోగించడం జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ వాణిజ్యంలో 80% ప్రజలకు మరియు సమాజానికి అంతర్జాతీయ షిప్పింగ్ ఉపయోగ పడుతుంది. మహా సముద్రాలైనా, సముద్రాలైనా వాటికుండే ప్రత్యేక లక్షణం నిరంతర చలనం. సముద్ర జలాలు ఒక్క క్షణము కూడా నిలకడగా ఉండవు. నిరంతరం ఏర్పడే అలలు అంతు చిక్కని లోతు సముద్ర జలాల ప్రత్యేకతలు. సూర్య చంద్రుల ఆకర్షణ శక్తి వల్ల సముద్రపు నీరు పైకి లేస్తుంది. అలా లేచిన నీటిని భూమి ఆకర్షణ శక్తి తనవైపు ఆకర్షిస్తుంది. అందువల్ల ఆ నీరు క్రమంగా ఒక అల రూపంలో సముద్రతీరం వైపు సాగుతూ వస్తుంది. సముద్రాలు, మహా సముద్రాలు, చిన్న నీటి వస్తువులు భూమిపై జీవనానికి ఆధారం. అవి లేకుండా ఆధునిక నాగరికత అసాధ్యం. మానవుడు సముద్రాలను చాలా చక్కగా ఉపయోగిస్తాడు. నీటి ఉ ఉపరితలంపై పదివేల నౌకలు ప్రయాణిస్తాయి, సైనిక జలాంత ర్గాములు నీటి కింద ఉన్నాయి. ప్రతిరోజూ వేలాది టన్నుల చేపలను లోతుల నుండి తీసి, సముద్రపు అడుగుభాగం నుండి చమురు బయటకు పంపుతారు. నీటి ఉపరితలంపై ఏదైనా పరికరాల పని ఎగ్జాస్ట్ వాయువుల ఉద్గారంతో పాటు, తరచూ వివిధ సాంకేతిక ద్రవాల లీకేజీతో కూడి ఉంటుంది. ఉదాహరణకు, ఇంధనం. అదనంగా, వ్యవసాయ క్షేత్రాలకు శుద్ధి చేయడానికి ఉపయోగించే రసాయనాలు, సమీపంలోని విశ్రాంతి గృహాల నుండి మురుగు నీరు మరియు చమురు ఉత్పత్తులు క్రమంగా సముద్రాల లోకి వస్తున్నాయి. ఇవన్నీ చేపల మరణానికి, నీటి రసాయన కూర్పులో స్థానిక మార్పులు మరియు ఇతర అవాంఛనీయ పరిణామాలకు దారితీస్తుంది. నీటి వనరులను నీటిని పొంద టానికి మాత్రమే కాకుండా, రవాణా, పారిశ్రామిక మరియు వైద్య ప్రయో జనాల కోసం కూడా ఉపయోగ పడుతుంది. భూమి యొక్క నీటి వనరులను ఉపయోగించే ప్రక్రియలో, చాలా హాని కలుగు తున్నది. సముద్రాలకు జరిగే ప్రధాన నష్టం కాలుష్యం. ఏదైనా సముద్రా నికి కాలుష్యానికి ప్రత్యేకమైన, స్థిరమైన మూలం ప్రవహించే నదులు. అనేక నగరాల గుండా వెళుతున్న నీరు కాలువలు, నదుల ద్వారా అదనపు కాలుష్యంతో సముద్రాలలో కలుస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా, మిలియన్ల క్యూబిక్ మీటర్ల రసాయనాలు, ఇతర ద్రవ వ్యర్థాలు సముద్రాలలో చేరుతున్నాయి. ప్రస్తుతానికి మానవ అవసరాలకు, అనియంత్రిత చమురు తీయడం సమస్య తీవ్రంగా ఉంది. ఇది సముద్ర జీవులకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుంది. అలాగే, కొన్ని జాతుల చేపలు (ప్రధానంగా ట్యూనా చేపల కుటుంబం నుండి) క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నాయి, ఎందుకంటే అవి యూ. ఎన్. గణాంకాల ప్రకారం 90% వద్ద పట్టుబడు తున్నాయి. సముద్ర జలం వల్ల లబ్ధిపొందు తూన్న మానవుడు తాను కలిగిస్తున్న నష్టం గురించి గాని, సముద్ర జలాలలో వస్తున్న మార్పును అంతగా పట్టించు కోవడంలేదు. తన చర్యల వల్ల కాలుష్యము అధికమై భూతాపము పెరిగి ధృవాలలోని మంచు కరిగిపోతుందని సముద్రమట్టము పెరుగుతుందని గమనించి, మానవుడు మేల్కొనక తప్పదు. నేటి వరకు పర్యావరణమంటే అడవులు, నదుల వరకే అనుకుని వాటికి సంబంధించిన అవగాహన మాత్రమే కల్పిస్తున్న అంతర్జాతీయ సంస్థలు సముద్ర జలాల గురించి ప్రజలకు తెలియ చెప్పాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

## బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన ఏదీ?

ప్రతి సంవత్సరం జూన్ 8ను అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ దినంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రజల్లో బ్రెయిన్ ట్యూమర్ పట్ల అవగాహన పెంపు, బాధితులకు మానవీయ మద్దతు కల్పించడం, అలాగే శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం. జర్మన్ బ్రెయిన్ ట్యూమర్ అసోసియేషన్ 2000వ సంవత్సరంలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచీ ఈ రోజు అనేక మంది జీవితాల్లో ఆశను నింపే ఉద్యమంగా మారింది.బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులోని కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వల్ల ఏర్పడే గడ్డ. ఇవి మెదడులో ఏర్పడిన ప్రాథమిక ట్యూమర్‌లు కావచ్చు లేదా శరీరంలోని ఇతర భాగాల నుంచి మెదడుకు వ్యాపించిన మెటాస్టాటిక్ ట్యూమర్‌లు కావచ్చు. ఈ ట్యూమర్‌లు కొన్ని సార్లు సౌమ్యంగా ఉండవచ్చు (బినైన్), మరికొన్నిసార్లు మెలిగ్నెంట్‌గా మారి ప్రాణాంతకంగా మారుతాయి. అయితే, రెండు రకాల ట్యూమర్లూ మెదడుపై ఒత్తిడిని కలిగించి, మానసిక, శారీరక పనితీరును ప్రభావితం చేయగలవు. బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు చాలా విభిన్నంగా కనిపించవచ్చు. ఉదయపు తలనొప్పులు, మూర్ఛ, జ్ఞాపకశక్తి లోపం, చూపులో మార్పులు, చేతులు కాళ్లలో బలహీనత, నడకలో తడబాటు, మాట్లాడడంలో తేడా, భావోద్వేగాల్లో మార్పులు వంటి సమస్యలు కనిపించవచ్చు.

# ఏపిపిజిసెట్- 2025 పరీక్షలకు సర్వం సిద్ధం

**జూన్ 7, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వం విశ్వవిద్యాలయం ఎపిపిజిసెట్- 2025 నిర్వహిస్తుంది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 4 ఏళ్ళ తరువాత తొలిసారిగా పిజిసెట్ నిర్వహించే బాధ్యతను ఉన్నత విద్యామండలి వారు అప్పగిస్తూ ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు ను కన్వీనర్‌గా నియమించారు. వారు పిజి సెట్ -2025 కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే పిజిసెట్ నిర్వహణకోసం కసరత్తు ప్రారంభించారు. ఎపిపిజిసెట్- 2025 ఛైర్మన్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి అయిన ఆచార్య సి. హెచ్. అప్పారావు మార్గదర్శనంలో పిజిసెట్ పనులు వేగంగాసాగాయి. మార్చి నెల 31వ తేదిన రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పిజి కోర్సు చేరే అభ్యర్థులు ఆన్‌లైన్‌ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదలయ్యింది. ఏప్రెల్ 2 నుంచి మే 25 వరకు విద్యార్థులు పిజి చేరేందుకు ఆన్‌లైన్ ధరఖాస్తులు సమర్పించారు. ఈ సంవత్సరం 31సబ్జెక్టులకు పిజి ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నారు. జూన్ నెల 9వ తేది నుంచి 12 వ తేదీ వరకు పిజిసెట్ పరీక్షలు షెడ్యూల్ విడుదలయ్యింది. ఈ సందర్భంగా పత్రికా విలేఖరులతో సమావేశం విశ్వవిద్యాలయం అధికారులు ఏర్పాటు చేశారు. యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, కన్వీనర్ ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్ ఆచార్య సురేంద్ర బాబు, తదితరులు హాజరై ఈ క్రింది అంశాలను వివరించారు. 1.పిజిసెట్-2025 జీవో నెం. 44 ప్రకారం నిర్వహించబడుతుంది. ఈ సంవత్సరం పిజిసెట్‌లో కొన్ని సబ్జెక్టులను కలిపివేసి విద్యార్థులకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవడం జరిగింది. (పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్) ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టులలో సీట్లు పొందే అవకాశం ఉంది. ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టులకు పరీక్షలు జరుగుతాయి. 2. ఇవి పిజి కోర్సులలో చేరే విద్యార్థులకోసం జరిగే ఎంట్రన్స్ పరీక్షలు.వారు డిగ్రీ స్థాయిలో తెలుగు ,ఇంగ్లీషు మాధ్యమాల్లో విద్యను అభ్యసించి ఉంటారు. అందువల్ల రెండు మాధ్యమాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ప్రశ్నా పత్రాన్ని ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేయడం జరిగింది. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, తమిళం, ఉర్దూ, భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి. 3. పిజిసెట్-2025 కోసం మొత్తం 25,688 మంది అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అప్లికేషన్స్ తగ్గాయి. దాదాపు 6000 అప్లికేషన్లు తగ్గాయి. 4. ఆంధ్రప్రదేశ్‌లో 17 విశ్వవిద్యాలయాలలో నిర్వహించబడుతున్న 143 ప్రోగ్రామ్స్,కు దాదాపు 25 వేల సీట్లకు విద్యార్థులను ఎంపిక చేయడానికి పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షా కేంద్రాలు రాష్ట్రంలోని 13 జిల్లాలతోపాటు, హైదరాబాదు నగరంలో కూడా పరీక్ష నిర్వహిస్తున్నాం. మొత్తం 30 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు జరుగుతాయి. పిజిసెట్-2025 పరీక్షలు జూన్ నెల 9, 10, 11, 12వ తేదీలలో నిర్వహించబోతున్నాం. ప్రతిరోజూ 3 షిఫ్టులలో పరీక్షలు జరుగుతాయి. మొదటి సెషన్ ఉదయం 9 గం. నుంచి 10:30 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12:30 నుండి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 గంటల నుండి 5:30 వరకు జరుగుతుంది. మొదటి రోజు 17 సబ్జెక్టులు, రెండవ రోజు 7 సబ్జెక్టులు, మూడవ రోజు 5 సబ్జెక్టులు, నాల్గవ రోజు 2 సబ్జెక్టులు మొత్తం 31 సబ్జెలు జరుగుతాయి. 6.ఎపిపిజిసెట్ పరీక్షల షడ్యూల్ మార్చి 31వ తేదీన ప్రకటించాము. ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలు పరీక్షా పరిశీలకులు వంటి ఏర్పాట్లన్ని పూర్తిచేశాము. ఇప్పుడు డిఎస్సీ షెడ్యూల్ విడుదలయ్యింది. కొంత మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు రెండు పరీక్షలు ఉన్నాయనే విజ్ఞాపనలు పంపారు. వారికి న్యాయం జరిగే విధంగా జూన్ 9వ తేది ఉదయం



జరగాల్సిన ఎంట్రన్స్ పరీక్షను జూన్ 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌కి మార్చడం జరిగింది. ఇక పిజిసెట్ పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండవు. యధాతథంగా జరుగుతాయి. 7. గతంలో లాగానే ఈ సారి కూడా కెమికల్ సైన్స్, లైఫ్‌సైన్స్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జూవాలజీ, మేథమేటిక్స్ వంటి సైన్స్ సబ్జెక్టులలో పోటీ ఎక్కువగా ఉంది. ఇంగ్లీషు, తెలుగు, హిస్టరీ, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టులలో ఒక మాదిరి పోటీ కనిపిస్తుంది. 8.ఏపిపిజిసెట్-2025 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సమయపాలన పాటించాలి. నిర్ణీత సమయానికి ఒక్క నిముషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతించరు. దివ్యాంగ విద్యార్థులు మొత్తం 68 మంది పరీక్ష రాస్తున్నారు. వారికి సహాయకులు సిద్ధంగా వుంచారు. 9. ఎపిపిజిసెట్- 2025 ఎంట్రన్స్ ఫలితాలను వీలైనంత త్వరగా అంటే జూన్ 25 లోపు ప్రకటిస్తాము. ఆ తరువాత అడ్మిషన్ ప్రక్రియ మొదలవుతుంది. ఈ సమావేశంలో ఏపిపిజిసెట్-2025 కార్యాలయ సిబ్బంది కామేశ్, నాగభూషణం, సుకుమార్, డా? వీరభద్ర, డా? ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో మహేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ.




**పాతపట్నం జూన్ 7 ప్రజాజ్యోతి న్యూస్..** ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలలు స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ముప్వల గుణశ్వేర్ (2051126259) 465/470 కిల్లి పవన్ 463/470 (2501126178) వి.నిరోష 204457/470 (2501126151) ప్రధమ ఎంపీసీ లోను మందరాడ చాందిని 427/440 (2501126544) కలమట భవ్య 423/440(2501126381) ప్రధమ బైపిసి లో ఉత్తమ ప్రతిభ కనమరిచారు. వీరితో పాటు 400 మార్కులు పైబడిన 17 ముంది విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.మధుబాబు, ప్రిన్సిపాల్ మెట్ట. అంజనేయులు, అకాడమిక్ డైరెక్టర్ కే. సింహాద్రి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా రక్తదానం చేసిన గుంతకల్ ముస్లిం సోదరులు


మత సామరస్యం మా నినాదం
రక్తదానమే మా విధానం రెడ్ డ్రాప్




**గుంతకల్లు జూన్ 7 (ప్రజా జ్యోతి):** శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది.ముస్లిమ్ సోదరులతో పాటు హిందూ,మరియు క్రిస్టియన్ సోదరులు కూడా పాల్గొని దాదాపు 249 మంది రక్తదానం చేయడం విశేషం. హైదరాబాద్ నుండి ఉరవ కొండ నుండి ఈ కార్యక్రమంలో వచ్చి బ్లడ్ డొనేట్ చేసారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి విచ్చేసి రక్తదాతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో రెడ్ డ్రాప్ ఫౌండర్ రెహమాన్, ప్రెసిడెంట్ గులాం మహమ్మద్,ప్రధాన కార్యదర్శి షఫీ,వైస్ ప్రెసిడెంట్ దివాకర్,గౌరవ అధ్యక్షులు ఇస్మాయిల్,ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఐ ఎగ్జామ్ ఆర్గ్ అనే న్యూ వెబ్ అప్లికేషన్ నీ ఆవిష్కరించిన సెంట్రల్ మినిస్టర్ కింజరాపు రామ్మోహన్ నాయుడు..


**కొత్తూరు జూన్07, ప్రజా జ్యోతి న్యూస్** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం బమ్మిడి గ్రామానికి చెందిన గండెం అశోక్ ఇటీవల ఐ ఎగ్జామ్ ఆర్గ్ అనే న్యూ వెబ్ అప్లికేషన్ రూపొందించారు. లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ద్వారా గండెం అశోక్ సెంట్రల్ మినిస్టర్ కింజరాపు రామ్మోహన్ నాయుడు ద్వారా ఆవిష్కరణ చేశారు.ఈ అప్లికేషన్ నిరుద్యోగ యువత కోసం కంపెనీలకి నుసంధానంగా రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గండెం అశోక్ మాట్లాడుతూ కంపెనీలు ఎగ్జామ్ నిర్వహించకుండా ఈ అప్లికేషన్ ద్వారా ఎగ్జామ్ నిర్వహించి డైరెక్టుగా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తుందనీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కి వివరించారు .కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ అప్లికేషన్ నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇటువంటి అప్లికేషన్ రూపొందించిన వారు మన జిల్లాకు చెందిన వారు కావడం




ఎంతో గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ యాప్ ను రూపొందించడంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అశోక్ కు సహకరించిన అతని స్నేహితులు రాజారెడ్డి, కోటి, హర్ష మొదలగు వారినీ ఆయన అభినందించారు..

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న శాసనసభ్యులు మామిడి గోవిందరావు

**పాతపట్నం జూన్ 07, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలంలో గల గులుమూరు గ్రామానికి చెందిన చెన్నూరి కోటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించడంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా ముఖ్యమంత్రి సహాయానిదికి ముఖ్యమంత్రి సహాయ నిధి కు దరఖాస్తు చేపించి ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2,00,000/-రూపాయిలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ ను అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి,సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని



తెలియజేశారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు అందిస్తున్నారు .అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.


## రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణ

**ప్రజా జ్యోతి తుగ్గలి** మండల కేంద్రమైన తుగ్గలి లో శనివారము సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలోరైతులకు వేరుశనగ సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర, తిమ్మాయి చౌదరి మనోహర్ చౌదరి చంద్రశేఖర్ యాదవ్ లు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు . త్వరలో రైతుల ఖాతాకు అన్నదాత సుఖీభవ కింద రూ 20వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ కూడా రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రైతులందరికీ సమృద్ధిగా సబ్సిడీ విత్తనాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ కె 6 రకం విత్త నం1క్వింటాలు 9, 300 రూపాయలు. సబ్సిడీ 3, 720 రూపాయలు, రైతు చెల్లించాల్సిన నికర ధర 5, 580 రూపాయలు, సబ్సిడీ 40 శాతం అన్నారు. 0.5 ఎకరాల వరకు1 బస్తా, 0.51నుండి 1.00 ఎకరం వరకు 2 బస్తాలు 1.01 ఎకరాలపైగా 3 బస్తాలు విత్తనాల పంపిణీ చే స్తారని తెలిపారు. రైతులు తమ భూ పత్రాలు, ఆధార్ మరియు అవ సరమైన సమాచారంతో సహా సమీప రైతు సేవా కేంద్రాన్ని సం ప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టిడిపి రాష్ట్ర నాయకులు తిమ్మయ్య చౌదరి,



మనోహర్ చౌదరి, టిడిపి నాయకులు వల్లె వెంకటేష్, విజయ్ భాస్కర్, కొమ్ము వెంకటేష్, బీసీ చంద్రశేఖర్ యాదవ్, తిరుపాల్ నాయుడు, బాలన్న, మిద్దె రవి కుమార్ యాదవ్, చెన్నంపల్లి లక్ష్మీనారాయణ చౌదరి, రాతన మైరాముడు, మామల్లకుంటు ఎడవల్లి తిమ్మప్ప, బెస్త కృష్ణయ్య తదితరులు సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు లోహితు, సాయినాథ్ రెడ్డి, ఎంపీఈఓ స్రవంతి ,అన్ని గ్రామాల వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన యాళ్ల వారి వివాహ వేడుక లో పాల్గొన్న



మురళీరాజు **కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రతిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో నాగేశ్వరరావు గారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,యాళ్ల ఏసు ,జువ్వల ముసలయ్య ,అంబటి గణేష్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పలు కుటుంబాలను పలకరించిన మురళిరాజు





**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తాటిపర్తి నాగేశ్వరరావు,అబ్బో తల్లి ఇటీవల కాలంలో స్వర్గస్తులయ్యారు వారి కుటుంబాన్ని పరామర్శించిన లిప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ముచ్చర్ల దాసు ,ముచ్చర్ల రాజు ,కడారి నూకరాజు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ ఉమా కాశీ విశ్వేశ్వర ఆలయ అభివృద్ధికి 25,000/- వేలు రూపాయలు విరాళం అందించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.



**కొత్తూరు జూన్ 07 ప్రజా జ్యోతి న్యూస్..** కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 గ్రామస్తులు,ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు శ్రీ ఉమా కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అభివృద్ధికి 25,000/- రూపాయలు విరాళం అందించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు .ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు, మాతల గాంధీ ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శు భాకాంక్షలు తెలిపిన రామరాజు మాస్టారు.



**పాతపట్నం జూన్ 07 ప్రజా జ్యోతి న్యూస్..** శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం మండలం, ప్రహరాజపాలెం మసీదు కామ్రాన్ లో గురువు ఆఫీజ్ షాజహాన్ ఆధ్వర్యంలో ఈద్-ఉల్ అజహా ప్రత్యేక నమాజ్ జరిగింది. పాతపట్నం నకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు నమాజ్ లో పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ-త్యాగానికి ప్రతీక బక్రీద్. త్యాగం మనిషిని ఉన్నతున్ని చేస్తుంది. పేదల పట్ల కరుణను బక్రీదు సూచిస్తుంది. ధనిక -పేద తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకుంటారని అన్నారు . అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షేక్ చాంద్, షేక్ ఇబ్రహీమ్, అలీ బాయ్, ఫకీర్ భాయి మొదలు వారు పాల్గొన్నారు.

# పెదమల్లం, కోడేరు గ్రామాలలో పల్లెపల్లెకు... మన పితాని కార్యక్రమం విజయవంతం.

ఎమ్మెల్యే పితాని.

వశిష్ట గోదావరిపై కోడేరు నుంచి తూర్పుగోదావరి జిల్లా గన్నవరం గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాం.



**పోడూరు /ఆచంట జూన్ 6, ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** వశిష్ట గోదావరిపై కోడేరు నుంచి తూర్పుగోదావరి జిల్లా గన్నవరం గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడిచిన నేపథ్యంలో ఆయన వినూత్నంగా ఆచంట నియోజకవర్గంలో "పల్లె పల్లెకు.. మన పితాని" కార్యక్రమం ద్వారా శుక్రవారం గ్రామాల్లో పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆచంట మండలం పెదమల్లం, కోడేరు గ్రామాలలో పర్యటించి అధికారులు ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులతో సమీక్షలు నిర్వహించారు. అయా గ్రామాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వశిష్ట గోదావరిపై భారీ వంతెన నిర్మాణ ప్రతిపాదన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఇదే విధంగా పెద్దమల్లం పంచాయతీ పరిధి అనగారిలంక, అయోధ్య లంక గ్రామాలకు వంతెన నిర్మాణాలు కూడా చేపడతామని అన్నారు. పెదమల్లం కోడేరు గ్రామాలలో తాగునీరు, విద్యుత్తు డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చర్యలు తీసుకుంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు జవాబు దారీతనంగా పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం పోయి ప్రజా ప్రభుత్వం వచ్చిందని ప్రజలు కూడా భయం లేని బతుకు జీవిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత లేని వారికి కూడా ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి సొమ్ములు దోచేసారని ఆయన ఆరోపించారు. కనీసం ఇళ్ళ పట్టాలు ఇచ్చే ముందు ఎంక్వైరీ కూడా చేయకపోవడం దారుణం అని అన్నారు. జగన్ కాలనీలో సౌకర్యాల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు మండల పరిషత్ నిధులు కూడా మళ్లించి దోచేసారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతులను నిర్వీర్యం చేసిందని కనీసం పంట కాలువలు బోదుల్లో తూడు కూడా తీయలేని దుస్థితి అని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలువలు పంట బోదెలు ఆధునికీకరణ చేపట్టామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారుల రాంగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని పింఛన్ సొమ్ములు రూ 3000 నుంచి రూ 4000 లు, వికలాంగులు పింఛను రూ 3,000 నుంచి రూ 6000 పెంచామని మూడు గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా అందిస్తున్నామని త్వరలోనే విద్యార్థులకు రైతులకు సొమ్ములు విడుదల చేస్తామని ఎమ్మెల్యే పితాని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని మించిన వెన్నుపోటు దారుడు ఎవరూ లేరని ఆస్తికోసం అటు తల్లిని చెల్లిని వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఎంతో మందిని వెన్నుపోటు పొడిచారని రాష్ట్ర ప్రజల సొమ్మును దోచేసి ప్రజలను వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మద్యం అమ్మకాలలో పెద్ద ఎత్తున కుంభకోణాలు జరిగితే ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంటే ఎందుకు కంగారు పడుతున్నారని జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదలపై మాత్రమే దర్యాప్తు జరుగుతుందని కక్షలకు తావు లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పెద్దమల్లం సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, కోడేరు సర్పంచ్ పెచ్చేటి కనకదుర్గ దేవి, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, డిసి ఛైర్మెన్ తమ్మినిడి ప్రసాదు, మండల టిడిపి అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, మాజీ మండల టిడిపి అధ్యక్షుడు కేతా మీరయ్య ,మండల జనసేన అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకట రామరాజు, బోడపాటి దుర్గా ప్రసాద్, పెచ్చేటి సుబ్రహ్మణ్యం, బిజెపి నాయకుడు సుబ్బారావు, తహసిల్దార్ జి కనకరాజు, ఎంపీడీవో వి పూర్ణ బాబ్జి వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం కూటమి నేతలతో సమావేశాలు నిర్వహించారు.

## రైల్లో గంజాయి రవాణాను అడ్డుకుంటాం

**రైల్వే స్టేషన్ నందు జి ఆర్ పి, ఆర్ పి ఎఫ్ పోలీసులు విస్తృత తనిఖీలు**




**గుంతకల్లు జూన్ 7 (ప్రజా జ్యోతి):** రైళ్ల ద్వారా వచ్చే గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుంటామని గుంతకల్లు రైల్వే పోలీస్ (జి ఆర్ పి) ఎస్ ఐ మహేంద్ర, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) పోలీసులు పేర్కొన్నారు. రైల్వే డిఐజి,ఎస్ ఆర్ పి, డి ఎస్ ఆర్ పి తిరుపతి వారి ఆదేశాల మేరకు శనివారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో జి ఆర్ పి ఎస్సై మహేంద్రా,ఆర్ పి ఎఫ్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు .రైళ్లు, స్టేషన్ పరిసరాలు,అనుమానా స్పద వస్తువులను తనిఖీలు చేశారు. పలువురు ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసి వివరా లను తెలుసుకున్నారు. ప్లాట్ ఫారం లోను, వెయిటింగ్ హాల్లో లోను,పార్శిల్ ఆఫీస్ ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ తది తర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గంజాయి నిర్మూలించేందుకు నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.ఇందులో భాగం గానే రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టామన్నారు.గంజాయి రవాణా చేసినా,విక్రయించినా కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి రైళ్ళలో తీసుకువచ్చి విక్రయిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## రత్నపల్లి గ్రామంలో 28వ చర్చ్ సంఘవార్షికోస్తాం

* తిరుపాలు ఘనంగా జరిగింది




**(ప్రజాజ్యోతి రిపోర్ట్ ) 07-6-2025**
వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామం పరిధిలో ఇమ్మానుయేల్ బాప్టిస్ట్ చర్చ్ 28వ సంఘవార్శికొస్తావానికి ముఖ్య అతిధులుగా కర్నూలు రాక్ వుడ్ చర్చ్ నుంచి అధ్యక్షులు రెవ. జి. కిషోర్ కుమార్ దైవసందేశం. అందించినవారు సంఘ సెక్రటరీ శ్రీ. ఎల్. వై.బెంజమిన్ రాజు గారు ఏసు క్రీస్తు గురించి సంఘ సభ్యులకు మనం లోకంలో జీవించిననంత కాలం శాంతి సమాధానం జీవించాలి అందరి మీ ధ ప్రేమ కల్గి ఉండాలి చర్చ్ లో వున్నవారు ఆయన మాటలకు ఆకర్షితులయ్యారు యుందులో పాల్గొన్నావారు చర్చి సంఘ పెద్దలు దైవసేవకులు రెవ. డేవిడ్ గారు పి. లుకయ్య పి. మత్తయ్య డాక్టర్ :సంజయ్ గ్రామ సర్పంచ్ కే. సుధాకర్ ఈ ప్రోగ్రామ్ని విజయవంతం చేశారు

## శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారిని చూసిన భక్తుల జన్మ ధన్యం





**గుంతకల్లు జూన్ 7 (ప్రజా జ్యోతి): కసాపురం** శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో శనివారం కావున విశేషాలంకరణతో స్వామి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి,శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి తులసి మాల తో సింధూర అర్చన విశేషంగా నిర్వహించడం జరిగినది.అనం తరం నిత్య అన్న ప్రసాద వితరణలో జూన్ 7 శనివారం రోజుతో 852వ కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించడం జరిగింది.అనంతరం కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం ఎంతో అపురూపంగా ఉందని ఇలాంటి శ్రీ లక్ష్మీ నారాయణ స్వాములవారి విగ్రహాలు ఎంతో అద్భుతంగా ఉన్నారని చూసిన వారి జన్మ ధన్యం ప్రతి ఒక్కరూ దర్శించవలసినటు వంటి క్షేత్రం ఏ దేవస్థానానికి వెళ్లిన అక్కడ ఉన్నటువంటి స్వామి అమ్మవారి దర్శనం మాత్రమే కలుగుతుంది.ఇక్కడ గుడి ఆవరణలో ఉన్న 8 ఉప ఆలయాలు స్వామి వారి విగ్రహాలు తోపాటు 27 నక్షత్రాలు రాశులు బంగారు బల్లి వెండి బల్లి చూడడం మనలో ఏవైనా దోషాలు ఉంటే దోష నివారణ జరగడం ఇక్కడ ఆలయ ప్రత్యేక విశేషం భక్తుల పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి అమ్మవారి దర్శించి అష్ట ఆయురారోగ్యాలు పొందాలని కోరుచున్నాము.ఆలయ అన్నప్రసాద సేవకులు మల్లికార్జున స్వామి మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనారాయ ణ స్వామి దేవస్థానం అనతి కాలంలోనే ఎంతో పేరు ఉన్న పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచిం దని భక్తులు ప్రతి రోజు వందల సంఖ్యలో రాష్ట్ర నలుమూలల నుండి రావడం అలాగే శ్రావణ మాసంలో మూడు ఆంజనేయ స్వాములు దర్శనాలతో పాటు గా ఆలయంలో వెలిసిన 4 వ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి రాతి విగ్రహం 8.అ.9 పొ ఉంటుందని అందరికీ దర్శన భాగ్యం ప్రత్యేక పూజలంకరణ లతో శ్రావణమాసం ఆ నెల అంతా ప్రత్యేక పూజలు ఉంటాయని 3 పూటలా నిత్య అన్నప్రసాద వితరణ ఉంటుం దని అన్నారు.ఈ కార్యక్రమం లో శశివర్ధన్ ,మురళి ,శివరత్న, తరుణ్ అది పాల్గొనడం జరిగినది.

## ఇసుక అక్రమ రవాణా పై ఎమ్మార్వో కఠిన చర్యలు తీసుకోవాలి



**(తెలుగుదేశం పార్టీ నాయకులు విజ్ఞప్తి)**

**అనంతగిరి ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్.శంకర్** మండలంలోకాశీపట్నం. చిలకలగేడ్డ గ్రామ పంచాయితీల పరిధి జిలుగులపాడు .కాశీపట్నం గ్రామాల సరిహద్దుగోస్థానినదీ జలాలనుండి ఇసుక త్రవ్వకాలు చేపట్టి అక్రమంగా మైదాన ప్రాంతాలుకు లక్షలాది రూపాయలు విలువైన ఇసుకను అక్రమ వ్యాపారులు మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని.తెలుగుదేశం పార్టీ నాయకులు సో క్లస్టర్ ఇంచార్జి ) వి. శంకర్రావు. (మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు) జన్ని చిట్టిబాబు.(సీనియర్ నాయకులు) పాంగి భీమన్న. (సీనియర్ నాయకులు) పాంగి రవీంద్రతదితరులు శనివారం నాడు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి అనంతగిరి మండల రెవెన్యూ అధికారి వంతల మాణిక్యం స్పందించి ఇసుక అక్రమ రవాణా పై నిఘా ఏర్పాటు చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతానికి సంబంధించిన విలువైన ఇసుకను మైదాన ప్రాంత వ్యాపారాలు రాత్రి వేళల్లో భారీ వాహనాలతో ఇసుకను తరలించకపోవడం వల్ల గిరిజన వాసులు నిర్మాణాల కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. అంతేకాకుండా ఇసుక ధరలు ఇష్టం వచ్చిన రీతిలో వ్యాపారులు పెంచి ఎటువంటి అనుమతులు లేకుండా క్రయ.విక్రయాలు జరుపుతున్నారని నాయకులు తెలిపారు. ఉచితంగా పొందవలసిన ఇసుకను అధిక ధరలు చెల్లించి గిరిజనులు కొనుగోలు చేయవలసిన దుస్థితి పట్టిందని.సహజ సిద్ధంగా లభిస్తున్న ఇసుకను గిరిజన వాసులు ఇంటి నిర్మాణాలకు పొందలేకపోతున్నారని నాయకులుఆవేదన వ్యక్తం చేశారు. నిఘా ఏర్పాటు కోరుతూ ఎమ్మార్వో కు ఫిర్యాదు చేశామని నాయకులు స్పష్టం చేశారు.

## ఆఫ్ షోర్ రిజర్వాయర్ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.



**మెలియాపుట్టి జూన్ 07, ప్రజా జ్యోతి న్యూస్..** ఆఫ్ షోర్ రిజర్వాయర్ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని శాసనసభ్యులు మామిడి గోవిందరావు కి వినతిపత్రం సమర్పించిన చీపురుపల్లి (పెద్దమడి) ఆర్ అండ్ ఆర్ గ్రామస్తులు సానుకూలంగా స్పందించిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు వీలైనంత త్వరలో మహేంద్ర తనయ ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్వాసిత గ్రామాలలో డ్రైనేజ్,సిసి రహదారులు,ఎలక్ట్రిసిటీ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు..

## రైల్వే స్టేషన్ లో చలివేంద్ర నిర్వహణకు ఆర్థిక సాయం.




**పాలకొల్లు. ప్రజాజ్యోతి (కొట్టి రామం)జూన్ 7.** వేసవికాలం దృష్ట్యా రైల్వే ప్రయాణికులకు పాలకొల్లు రైల్వే స్టేషన్ నందు సౌత్ సెంట్రల్ రైల్వే డి ఆర్ యు సి సి మెంబర్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు శ్రీ జక్కంపూడి కుమార్ ప్రోత్సాహముతో ఉభయ గోదావరి జిల్లాల గోవింద మాల కళ్యాణోత్సవ కమిటీ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ చలివేంద్రమునకు నాలుగు రోజుల పాటు నిర్వహణకు అయ్యే సొమ్మును దిగమర్రు బైపాస్ రోడ్డు నందు గల శ్రీ సూర్య మార్బుల్ ట్రేడర్స్ శనివారం ఆర్థిక సహాయం గా అందచేశారు. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల గోవిందమాల కళ్యాణోత్సవ కమిటీ గురుస్వామి యాదంరెడ్డి సత్యం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. చలివేంద్రం నిర్వహణకు గాను ఎవరైనా ఉత్సాహవంతులైన దాతలు ఉంటే కమిటీ వారిని సెల్ నెంబర్. 9491577097నందు సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

## ఆంధ్రప్రదేశ్ కోర్టు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ: శ్రీ భావపురి కోచింగ్ సెంటర్లో ప్రత్యేక కార్యక్రమం




**బాపట్ల జూన్ 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల: రాష్ట్ర హైకోర్టు మరియు జిల్లా కోర్టుల్లోని 10 విభాగాల్లో 1620 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ నేపథ్యంలో, బాపట్లలోని శ్రీ భావపురి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు కరపత్రాల విడుదల సందర్భంగా తెలిపారు.ఈ నెల 9, 10, 11 తేదీలలో సోమవారం నుండి బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు శిక్షణ జరుగనుంది. జీకే, కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్, అర్థమెటిక్, జనరల్ స్టడీస్ వంటి కీలక అంశాలపై విజయవాడ "ఫోకస్ ఫార్టీ" మరియు హైదరాబాద్ నుండి వచ్చిన ప్రముఖ శిక్షణా సంస్థల సీనియర్ ఫ్యాకల్టీ లచే శిక్షణ కల్పించనున్నారు. మరిన్ని వివరాలకు 9848791935 నెంబర్ ను సంప్రదించవచ్చు. కార్యక్రమంలో, డీఎస్సీ అభ్యర్థులకు మార్గనిర్దేశం చేస్తూ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు మెగా డీఎస్సీ ద్వారా 16347 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.45 రోజులుగా డీఎస్సీ శిక్షణ పొంది రాత పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సీడిఈఎమ్ ద్వారా శిక్షణ ఇచ్చిన సీనియర్ ఫ్యాకల్టీ శ్రీ కె.వి.ఆర్.జి. శర్మ, శ్రీ హరి శుభాకాంక్షలు అందించారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ గురువులను సన్మానించారు. విజయవాడ ఫోకస్ ఫార్టీ డైరెక్టర్ కె.కె., ఎం.డి. నాగలక్ష్మి మేడం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఐ గారికి అంత అత్యుత్సాహం ఎందుకండీ.

వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలనే టార్గెట్ చేస్తారా..?
టీడీపీ నేతలకు కొమ్ము కాయడానికే ఇక్కడకి వచ్చారా..?
అది నిజమైతే ఖాకీ చొక్కా కాకుండా పసుపు చొక్కా వేసుకోండి
తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫైర్





**జూన్ 7, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** 'సీఐ గారు.. మీకు అంత అత్యుత్సాహం ఎందుకండీ.. పసుపు పార్టీ బ్యానర్లు మీ కంటికి కనపడలేదా..? మీరు ఏమైనా ఆ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నారా..? పోలీసు శాఖలో పనిచేస్తున్నారా..? ఈ రాష్ట్రంలో అమలు అవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో నెంబర్ వన్ సీఐగా కావాలని తపన పడుతున్నారా..? అందుకే వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్‌గా పెట్టుకున్నారా..? టీడీపీ నేతలు ఎవ్వరు పేరు చెడితే వారిపై కేసులు పెడతారు.. కళ్ల ముందే టీడీపీ గుండాలు రెచ్చిపోతుంటే అమాయకపు ప్రజలపై లాఠీ చార్జి చేస్తారు.. అలాంటపుడు ఖాకీ చొక్కా కాకుండా పసుపు చొక్కా వేసుకోండి.. మీరు చేస్తున్న అరాచకానికి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.. గుర్తుంచుకోండి..' అంటూ చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హెచ్చరించారు. చంద్రగిరి డీఎస్పీ కార్యాలయంలో శనివారం బాధితులతో కలసి సీఐ చిన్నగోవిందు, లింగేశ్వరనగర్ పంచాయతీలో గొడవలకు కారణమైన వారిపై చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ప్రసాద్ కు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు జన్మదినం సందర్భంగా తన ఇంటి వద్ద శుక్ర వారం రాత్రి జన్మదిన వేడుకలు జరుపుకుంటుండగా స్థానిక టీడీపీ మహిళా నేత హేమలత, ఆమె కుమారుడు చిట్టిలు సర్పంచ్ ఆయన ప్లెక్సీలను చించివేశారు. దీంతో తమ ప్లెక్సీలు ఎందుకు చింపుతున్నారని అడిగిన సర్పంచ్ కోటేశ్వరరావుతో పాటు అతని భార్య ముని పుష్పలపై దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్యన వివాదం చోటు చేసుకుందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫిర్యాదు చేసిన తరువాత మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా పల్లెల్లో ఏదైనా గొడవ జరిగితే పోలీసులు అక్కడకు వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పి వివాదం తీవ్రతరం కాకుండా శాంతియుత పద్ధతిలో అణచివేస్తారని, తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు మాత్రం అసలు గొడవ ఏమిటి..? ఎవ్వరు ఎవ్వరిపైకి దాడి చేశారు..? గొడవలకు గల కారణాలు ఏమిటి..? అన్న ప్రాథమిక సమాచారం తీసుకోక సర్పంచ్ ఇంటికి బర్తడే పార్టీకి వచ్చిన గ్రామస్తుల అందరిపై లాఠీ చార్జి చేయడం, అక్కడ టీడీపీ ప్లెక్సీలు అలాగే వుండగా, వైఎస్ఆర్‌సీపీ ప్లెక్సీలను బలవంతంగా తాను సీఐ అన్న విషయం మరచి ఆయనే చించివేయడం, తన సిబ్బంది చేత చించివేయించడం వంటి పనులు చేశారన్నారు. అలా చేయడం పోలీసులకు తగదని, ఖాకీ చొక్కా వేసుకుని అలాంటి పనులు చేయడం కంటే పసుపు చొక్కా వేసుకుని చేస్తే బాగుంటుందన్నారు. గతంలో కూడా వైఎస్ఆర్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి టీడీపీ వాళ్లపై ఫిర్యాదులు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఒకరు ఏదో పోస్టు పెట్టారని అతనిపై కక్షకట్టి స్థానిక ఎమ్మెల్యే నాని ఒత్తిడి చేయడంతో అక్రమంగా అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు పంపించారన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలనే టార్గెట్‌గా పెట్టుకుని వేదింపులకు దిగుతున్న ఆ సీఐపై న్యాయ పోరాటం చేస్తామని, అంతకంటే ముందు ఆయన పైఅధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదుపై డీఎస్పీ ఏలాంటి చర్యలు తీసుకోకుంటే త్వరలో ఎస్పీని కలుస్తామని, ఆపై న్యాయస్థానంలో ప్రయివేటు కేసులు పెడతామన్నారు. లింగేశ్వరనగర్ పంచాయతీలో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చేసిన అరాచకం వీడియోలను కోర్టు ముందు పెట్టి ఖచ్చితంగా ఆయనపై కేసు నమోదయ్యేలా చూస్తామని, అంతకంటే ముందుగా తమ పార్టీ సర్పంచ్ ప్లెక్సీలు చించివేసి గొడవకు కారకులైన వారందరిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వెంట పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

## ఘనంగా సామంచి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు..



**జూన్ 7 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది సామాజిక శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఎడిఫై స్కూల్ అధినేత, ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ పెనుమాడు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ప్రణీత్ పెనుమాడు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దయతో సామంచి శ్రీనివాస్ మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్



**నందిగామ, జూన్ 07 (ప్రజాజ్యోతి)**
నందిగామ పట్టణం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నందిగామ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మహమ్మద్ సాదిక్ ఆలం రజ్వి బక్రీద్ పండగ సందర్భంగా నమాజును చదివించి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మత గురువు బక్రీద్ పండగను ఉద్దేశించి మాట్లాడుతూ దైవం మానవుని దయ, త్యాగ గుణాల గురించి కఠినమైన పరీక్షలు పెడతారని, అందులో నెగ్గిన వారికి మంచి జీవితం ప్రసాదిస్తారని తెలిపారు. వారినే మానవ లోకానికి ఆదర్శంగా నిలుపుతారన్నారు. భక్తులు అల్లాహ్ మార్గాన్ని అనుసరించాలన్నారు. మనిషిలోని చెడు గుణాలను కూడా వదిలి వేయాలని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాహ్ ఆదేశాన్ని పాటించిన సంఘటన గురించి వివరించారు. అలాగే మనుషుల్లో త్యాగ గుణం పెరగాలన్నారు. సాటి మనుషులతో పరస్పరం సహకరించుకుంటూ ఉన్నప్పుడే ప్రశాంత జీవనం, ప్రపంచ శాంతి సాధ్యమవుతాయన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్రావు బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గా వద్ద చేరుకొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు.

## తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ పునరాలోచన చేయాలి

రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి రాజశేఖర్.
ఆన్లైన్ విధానాన్ని విద్యాశాఖ ఉపసంహరించుకోవాలి.
విద్యాశాఖ హామీని నిలబెట్టుకోలేని ఎడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.



**పాలకొల్లు మే 7 ప్రజాజ్యోతి ప్రతినిధి** : రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్లో కాకుండా ప్రాథమిక ఉపాధ్యాయుల బదిలీలు మౌఖికముగా జరుపుతామని ఉపాధ్యాయులకు రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా గత రెండు వారాలుగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ఆన్లైన్ లో జరుపుతుండడంతో శనివారం ఉపాధ్యాయులు సమిష్టిగా సమకూడి పోడూరు ఎంఈఓ కార్యాలయం ప్రాంగణంలో తమ నిరసనను పెద్ద ఎత్తున తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ఈ రకంగా మోసం చేసి వంచించడం ఉపాధ్యాయులను అగౌరవపరచడమేనని ధ్వజమెత్తారు. రెండు జిల్లాలలోని ఖాళీలను ఆన్లైన్లో పెట్టుకోవడం పెద్ద ప్రహసనం అని దీనివల్ల ఏ పొరపాటు జరిగినా ఖాళీలు బర్తీలలో తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. కాబట్టి ఉపాధ్యాయులు ఏ ఆర్థిక భారం లేని విధానాన్ని కోరుతుంటే ఉపాధ్యాయుల మనవిని ఆలకించకుండా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఎందుకు ఈ ఆన్లైన్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారో ఉపాధ్యాయ సంఘాలకు అర్థం కావడం లేదని అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. కాబట్టి తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ పునరాలోచన చేసి ప్రస్తుతం కొనసాగుతున్నటువంటి ఆన్లైన్ విధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని మౌఖిక విధానంలో కౌన్సిలింగ్ చెప్పించి బదిలీలు చేసుకునేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకోని ఇచ్చిన మాటని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను నానా ఇబ్బందులకు గురుచేయటం వల్ల ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉందో గమనించాలని ఉపాధ్యాయుల సంఘాలకు ఇచ్చిన మాటని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేనియెడల ఉద్యమాన్ని పెద్ద ఎత్తున తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ,గుణ్ణం విజయ్ కుమార్ కి మండల అధ్యక్షులు డి.క్షేమమూర్తి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు బి శేషగిరిరావు, నాయకులు కె పెద్దిరాజు,సిహెచ్ త్రినాధ్, డివివి ప్రసాద్, ఎంపీ రావు, ఉపాధ్యాయులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పిడుగుపాటుతో రైతు మృతి

పరామర్శించిన జనసేన మండల పార్టీ అధ్యక్షులు పైడి మురళీ మోహన్



**సరుబుజ్జిలి ,ప్రజా జ్యోతి న్యూస్ :** సరుబుజ్జిలి మండలం బుడ్డి వలస గ్రామంలో పిడుగుపాటుకు గురై కౌలు రైతు బూరాడ అప్పలనాయుడు మృతి చెందాడు. అప్పలనాయుడు కౌలుకు తీసుకున్న పొలం పనులు సాయంత్రం వేళ చేయుచుండగ ఒక్కసారిగా పిడుగు పడి మరణించారు. దీంతో ఈ విషయం తెలిసిన జనసేన మండల అధ్యక్షులు పైడి మురళి మోహన్ అప్పలనాయుడు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. దేశానికి అన్నం పెట్టిన రైతు ఇంట ఇటువంటి విషాదకరమైన వార్త నా హృదయాన్ని కలచివేసిందన్నారు. కౌలు రైతులు కష్టాలు అన్ని ఇన్ని కాదు అని,ఆరు కాలం ఎండనక వాననక రాత్రి అనక తన కష్టాన్ని చిందించే దేవుడి గుడిలో ప్రసాదం పెట్టిన కౌలు రైతు ఇంట విషాదం మాకు బాధాకరం అని తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళి కౌలు రైతుల నష్టపరిహారాన్ని అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో జనసైనికులు తులగాపు ధనుంజయ రావు, సంఘం శెట్టి తేజేశ్వరరావు, మిన్నారావు, వాడవలస వాసుదేవరావు, తదితర జనసైనికులు ఉన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను సత్కరించిన డీవిఎఫ్



**తాళ్లపూడి, జూన్ 7, ప్రజా జ్యోతి న్యూస్** రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కె.ఎస్ జవహర్ ను కొవ్వూరు నివాసంలోమర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించిన దళిత వర్గాల ఫెడరేషన్ చెట్టే రాజు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీలకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి పరితపించే వ్యక్తి జవహర్ అని కొనియాడారు దళిత జాతికి మరింత సేవలు అందించేలా ప్రభుత్వం కమీషన్ చైర్మన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తంచేశారుఈకార్యక్రమంలోపూలపల్లి బాలకృష్ణ , మల్లిపూడి కిషోర్ బాబు గ, మర్లపూడి కృష్ణ బాబు , మార్లపూడి అచ్చిబాబు చెట్టే బాలు , యామవరపు సంజయ్ కుమార్ తదితరులు ఉన్నారు


## వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం



**జూన్ 7 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామివారు పద్మసరోవరంలో తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, నిర్వహించారు. మధ్యాహ్నం 03.00 నుండి 4.30 గంటల వరకు శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ కృష్ణస్వామివారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులోభాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ కృష్ణస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గుంతకల్లు నియోజకవర్గం లో స్థానిక ఎన్నికలతో వైసీపీ భూస్థాపితం అవ్వడం ఖాయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్
వైసీపీ నుండి టిడిపిలోకి 40 కుటుంబాలు చేరిక



**గుంతకల్లు జూన్ 7 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు యువనేత పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో గుత్తి మండలం టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ లో చేరారు. పార్టీ లో చేరిన వారికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పార్టీ కండువా కప్పి సాధరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. పార్టీ లో చేరిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి కార్యక్రమాలకు ఆకర్షితులై స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పాలన విధానం నచ్చి టీడీపీ పార్టీలోకి చేరడం జరిగింది అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయింది మేము గెలిచిన రోజునుండి గతం లో ఏ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ప్రజలలో ఈ విదంగా మమేకం కాలేదని, కార్యకర్తలు ఏ శుభ కార్యాలకు ఆహ్వానించిన వారిని నొప్పించ కుండా హాజరవుతున్నామని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా వుంటున్నామని నియోజకవర్గం నాయకులు కార్యకర్తల అభిప్రాయంతో నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్నామని టీడీపీ పార్టీ ని మరింత బలోపేతం చేసి కచ్చితంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గం లో వైసీపీని భూస్థాపితం చేస్తామని గుమ్మనూరు జయరాం మరియు గుమ్మనూరు ఈశ్వర్ ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం లో గుత్తి పట్టణ మరియు మండలం కూటమి ముఖ్యనాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## చెస్ ఇన్ స్కూల్ నందు ఉత్తమ ప్రతిభ కనపరచిన చెవిటికల్లు గ్రామవాసి




**కంచికచర్ల, జూన్ 07 (ప్రజాజ్యోతి)** ఆంధ్ర చెస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్ప్రాట్స్ ఫైన్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు 3,4 తేదీల్లో చెస్ ఇన్ స్కూల్ సెమినార్ నిర్వహించడం జరిగింది. దీనిద్వారా నూతన విద్యార్థులకు ప్రొఫెషనల్ కోచ్ లను తయారు చేసే చెస్ ఇన్ స్కూల్ పరీక్ష లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన చెస్ కోచ్ చెవిటికల్లు గ్రామనికి చెందిన గుజ్జర్లపూడి చెన్నకేశవులు. ఆయన ను శుక్రవారం గుజరాత్ కు చెందిన ఇండియన్ చెస్ 11వ గ్రాండ్ మాస్టర్ అయిన శ్రీ తేజెస్ బక్రీ చెన్నకేశవులు ను ఘనంగా సన్మానించి, షీల్డ్ మరియు ప్రశంశా పత్రాన్ని అందించారు. తేజెస్ బక్రీ మాట్లాడుతూ చెన్నకేశవులుకు మంచి భవిష్యత్ ఉందని ఇలాంటి సన్మానాలు షీల్డ్ లు మరెన్నో అందుకోవాలని తన కింద విద్యార్థులకు ఏంత గానో సహాయం అందించాలని సూచించారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

**జమ్మికుంట :** పేద ప్రజలకు ఉండడానికి గూడు నీడ ఏర్పాటు చేయడమే తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న అన్నారు. జమ్మికుంట మండలంలోని నగురం గ్రామానికి తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు తొమ్మిది ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న స హాజరై నగురం గ్రామానికి చెందిన అంతటి సంతోష్, కి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా శనివారం రోజున ఇల్లు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న మాట్లాడుతూ గత బిఆర్ఎస్ 9 సంవత్సరాల ప్రభుత్వము హయాంలో ఏ ఒక్క నిరుపేద ప్రజలకు ఇల్లు కట్టించి ఇచ్చిన పాపాన పోలేదని అప్పటి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి పేద ప్రజల సమస్యలు తెలుసుకొని తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ 13 నెలల వ్యవధిలోనే తెలంగాణలోని ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని హుజురాబాద్ నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయడానికి కృషి చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్



బాబు, లకు ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పూర సంపత్ రావు, యువజన కాంగ్రెస్ నగురం గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సంపత్, నగురం మాజీ సర్పంచ్ అంతటి విమల, సమ్మయ్య, చెరుకు దేవేందర్, పోల్సాని శ్రీనివాసరావు, కవ్వంపల్లి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు...

# సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్‌కు సంప్రదించాలి

**అదిలాబాద్ :** సైబర్ నేరాలకు ప్రజలకు అప్రమత్తత ప్రధాన అస్త్రం సైబర్ బారిన పడిన గంటలోపు సంప్రదిస్తే డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఎక్కువ. గతవారం జిల్లాలో దాదాపు 15 ఫిర్యాదులు నమోదు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్ ప్రస్తుతం చలామణిలో ఉన్నవి. జిల్లా సైబర్ బృందం చే ప్రతిరోజు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు. భవిష్యత్తు సైబర్ నేరాల తో మాత్రమే ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు వహించాలని సూచన. రానున్న భవిష్యత్తు ప్రపంచంలో సైబర్ నేరాలకు గురై ప్రజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన ఖచ్చితంగ కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. శనివారం స్థానిక పోలీసు కార్యాలయం లో మాట్లాడుతూ. సైబర్ నేరాలకు ప్రజలు గురైన వెంటనే 1930 నెంబర్ కి సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలకు బారిన పడిన గంటలోపు ఫిర్యాదు చేసిన ఎడల ఆర్థిక నష్టం జరిగిన వాటిని తిరిగి రప్పించే అవకాశం ఎక్కువగా ఉన్నందున గోల్డెన్ హవర్ లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమైనదని తెలిపారు. సమాజంలో ప్రజలకు జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రస్తుత సమాజంలో జరిగే ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, క్రెడిట్ కార్డు ఫ్రాడ్ లాంటివి ఎక్కువగా జరుగుతున్నదని ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కల్పించి, ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండడం ఉత్తమ మార్గమని తెలియజేశారు. వాట్సాప్ గ్రూపుల నందు ఎలాంటి ఏపీకే ఫైల్స్ లను డౌన్లోడ్ చేసుకోకుండా ఉండాలని, వాటి ద్వారా మొబైల్ ఫోను సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుందని ఇలాంటి వాటికి గురైనప్పుడు వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ లలో ప్రజలు అత్యాశతో డబ్బులను వారికి విడతల వారీగా అందజేస్తూ చివరికి మోసపోయామనే విషయాన్ని గ్రహిస్తున్నారని తెలిపారు. అనవసరంగా ఇతరుల వ్యక్తులకు క్రెడిట్ కార్డు ఓటిపి నంబర్లను తెలియజేయడం వల్ల డబ్బు నష్టపోతున్నారనే విషయాన్ని తెలిపారు.

**ఆదిలాబాద్ జిల్లా నందు గత వారం రోజులుగా నమోదైన పలు కేసుల వివరాలు:**

ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి గత రెండు నెలలుగా జైనం బ్రోకింగ్ స్టాక్ ఎక్స్చేంజ్ గ్రూప్ లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఈ గ్రూప్‌లో సభ్యులు మొదట స్టాక్ ట్రేడింగ్‌పై దృష్టి సారిస్తారు. అయితే, స్టాక్ మార్కెటింగ్‌లో పెట్టుబడి పెట్టి సుమారు 28 లక్షల రూపాయలు నష్టపోయాను. ఈ విషయాన్ని పరిశీలించి, వాట్సప్ గ్రూప్ 262" లో ఉన్న సభ్యులు నన్ను మోసగిం



చారని నేను గుర్తించి, సైబర్ కార్యాలయాన్ని సంప్రదించడం జరిగింది. ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ని ఒక వ్యక్తి ఒక నకిలీ అక్రమ వెబ్‌సైట్‌లోని బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొనమని డబ్బులు ఎక్కువగా సంపాదించవచ్చు అని తప్పుదారి పట్టించిన సైబర్ నేరగాళ్లు. వారు మ్యాచ్ ఫలితాల ముందస్తు అంచనాలు ఇచ్చి, ఖచ్చితమైన లాభాలు వస్తాయని హామీ ఇచ్చారు. అయితే, చెల్లింపు చేసిన తర్వాత తనకు ఎటువంటి సహాయం గానీ, గెలుపు మొత్తం గానీ అందలేదు. అప్పుడే ఇది ఒక మోసం వెబ్‌సైట్ అని అతనికి తెలియ వచ్చింది. ఈ మోసం నందు అతను పదివేల రూపాయలను పోగొట్టుకోవడం జరిగింది.

ఉట్నూరు మండలంలోని చేతన్ కుమార్ అనే వ్యక్తికి వాట్సప్ లో ఒక మెసేజ్ వచ్చింది. మెసేజ్ పంపిన వ్యక్తి పేరు మిస్సు పల్లవి ఝా, ఆమె తనను ప్రైవేట్ కంపెనీలో రిసెప్షనిస్ట్ ఇన్‌ఛార్జ్ అని పరిచయం చేసుకుంది.

ఆమె చెప్పినది ఏమిటంటే, మీరు ఇంటి నుంచే చేసుకోగలిగే పార్ట్ టైం జాబ్ ఇస్తున్నాం, వర్కింగ్ అవర్స్ ఫ్లెక్సిబుల్ గా ఉంటాయి. జాబ్ మరియు జీతం వివరాలు చెప్పనా? అని అడిగింది. ఆ తరువాత ఆమె వివరించింది జాబ్ ఏంటంటే, గూగుల్ మ్యాప్స్ లో హోటల్స్ కి 5 స్టార్ రివ్యూలు ఇవ్వాలి. మీరు రోజుకి పూర్తిచేసే టాస్కులపై ఆధారపడి రోజుకి 2000 నుంచి 8000 వరకు జీతం ఉంటుంది. మీరు ఒక్క టాస్క్ పూర్తి చేస్తే వెంటనే జీతం వస్తుంది, ఆపై తరువాత టాస్క్ ఇస్తాం అని చెప్పింది.

విత్‌డ్రా కోసం సీనియర్ రిసెప్షనిస్ట్ చందాని సంప్రదించమంది. నా డబ్బు తిరిగి ఇచ్చింది. అప్పుడే నాకు ఇది నమ్మకంగా అనిపించింది.

తర్వాత ఆమె మరో ప్రీపెయిడ్ టాస్క్ ఇచ్చింది. నేను ముందుగా తిరస్కరించినా, ఆమె తిరిగి తిరిగి అడుగుతూ మెంటల్‌గా ఒత్తిడి చేసింది. చివరికి నాకు మైండ్ వాష్ అయిపోయి, ఇంకా డబ్బు వస్తుందేమో అనే ఆశతో అంగీకరించాను. అప్పుడు ఆమె నాకు మరో టీచర్ ఐడీ పంపింది పేరు అంద్రే కోవల్స్కి

మొదటి ఆర్డర్‌కు నేను 9700 చెల్లించాను. ఆ తరువాత అతను మరో టాస్క్ ఇచ్చాడు, అది 38,000. రెండు ప్రీపెయిడ్ టాస్కులు చేసిన తరువాత ఇవి సరిపోతాయి, అని అనుకున్నాను. కానీ అతను మళ్లీ మరో టాస్క్ ఇచ్చాడు అది 77,000.

ఆ డబ్బు చెల్లించకపోతే మీ డబ్బంతా పోతుంది, అని బెదిరించాడు. నాకు భయంగా అనిపించి, నా స్నేహితుని సహాయం తీసుకుని 77,000 రుణంగా తీసుకుని అతనికి పంపించాను. కానీ ఆ తరువాత కూడా మళ్లీ ఇంకొక టాస్క్ ఇచ్చాడు.

ఇలా టాస్క్ మీద టాస్కులు ఇచ్చి నప్పుడు ఆయన మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు సంప్రదించాడు. ఇలా విడతలవారీగా ఆయన ఒక లక్ష 30 వేల రూపాయలను పోగొట్టుకోవడం జరిగింది.

ఇచ్చోడ మండలంలోని ఒక వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను వాట్సాప్‌లోకి మారుస్తూ, మీరు పెట్టుబడి పెడితే మీకు డబ్బు డబుల్ చేస్తాం అని చెప్పారు. నాకు, ఎంత పెట్టుబడి చేయాలనుకుంటున్నారు? అని అడిగారు. బాధితుడు 20,000 పెట్టుబడి చేస్తానని చెప్పాడు.

తరువాత వారు చెప్పారు, మీకు 1,39,900 లాభంగా వచ్చింది, కానీ మీరు దానిని విత్‌డ్రా చేసుకోవాలంటే ముందుగా 25 శాతం చెల్లించాలి, అన్నారు. ఆ కిందా బాధితుడు 34,975 చెల్లించాడు.

ఆ తరువాత, మీకు ఖాతా క్రియేట్ చేయాలంటే 39,999 మరోసారి చెల్లించాలి, అని చెప్పారు.

నా దగ్గర డబ్బు లేకపోవడం వల్ల నేను పంపలేకపోయాను. దాంతో, వారు నా ఖాతాను బ్లాక్ చేసి, వాట్సాప్ చాటింగ్‌ను కూడా క్లోజ్ చేశారు. టెలిగ్రామ్ కూడా డిలీట్ చేశారు. అని ఫిర్యాదు చేయగా, బాధితుడు మొత్తం చెల్లించిన మొత్తం 54,975. మోసపోవడం జరిగింది.


ఆన్‌లైన్ మోసాలు వ్యాపార మరియు పెట్టుబడి మోసాలు ఇతర రకాలు

బాధితుడికి గుర్తు తెలియని టెలిగ్రామ్ ఐడీ నుండి ఒక మెసేజ్ వచ్చింది, అందులో క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెట్టమని సూచిస్తూ ఒక లింక్ ఇవ్వబడింది. ఆ లింక్ ద్వారా బాధితుడు నమోదు అయ్యాడు. అనంతరం టెలిగ్రామ్‌లో పెట్టుబడి ఎలా చేయాలో వారికి గైడ్ చేశారు మరియు బాధితుడు డబ్బును పెట్టుబడి చేశాడు.

తరువాత పెద్ద మొత్తం పెట్టుబడి చేసిన తర్వాత, బాధితుడు ఆ డబ్బును విత్‌డ్రా చేసుకోలేని పరిస్థితి ఎదురైంది. అప్పుడు అతనికి ఇది ఒక మోసం అని తెలిసి 1930 నంబర్‌ను సంప్రదించాడు.

# 500 మంది జనాభా 3 కిలోమీటర్ల దూరం ఉంటేనే కొత్త పంచాయితీ

**హైదరాబాద్ :** కొత్త పంచాయతీల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు పంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నది. ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పక్కా గైడ్లైన్స్ రూపొందించి ముందుకెళ్లాలని నిర్ణయించింది. ప్రధానంగా 500 కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలను పంచాయతీలుగా మార్చడంతో ప్రభుత్వానికి అదనపు భారమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆఫీసర్లు చెప్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త పంచాయతీలు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల టైమ్లో హామీ ఇచ్చినట్లు నేతలు చెప్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వీళ్లంతా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీల కోసం 250 వరకు పంచాయతీరాజ్శాఖకు దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్లతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు కూడా జతచేసి ఉన్నాయి. దీనిపై పంచాయతీ



రాజ్యాధి అధికారులు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెప్పించారు. చాలా దరఖాస్తులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది.

**3 కిలో మీటర్ల దూరం ఉండాలి:**

రాష్ట్రంలో ప్రస్తుతం 12,777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త పంచాయతీల కోసం సుమారు 250 దరఖాస్తులు రాగా.. అందులో 37 గ్రామాల్లో మాత్రమే 500 జనాభా ఉన్నట్లు తేలింది. మిగిలిన గ్రామాల్లో 500లోపు జనాభా ఉంది. వికారాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కేవలం 90 కుటుంబాలు ఉన్న ఓ పల్లెను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పంపినట్లు తెలిసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయాలంటే కనీసం 500 జనాభా ఉండాలని, పల్లెకు, పల్లెకు మధ్య 3 కిలో మీటర్ల దూరం ఉండాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. దీంతో ఇలాంటి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టారు. త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 10వేలు ఉద్యోగాలను భర్తీ చేయాలి


**ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్**




**ప్రజా జ్యోతి తుగ్గలి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ శాఖలో వివిధ కేటగిరీలో ఉన్న10వేలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉద్యోగస్తులపై ఎక్కువ పని భారం పెరిగిందన్నారు .ప్రతి సంవత్సరం ఇంటర్,డిగ్రీ పట్టభద్రులై, పై చదువు చదివిన నిరుద్యోగులుగా చాలా సంవత్సరాలుగా ఉద్యోగాలు కోసమే ఎదురుచూస్తున్నారు. ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నోటిఫికేషన్ విడుదల చేయడం వలన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. విద్యుత్ శాఖలో 10వేలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు,ఉద్యోగాలను భర్తీ చేయకపోతే నిరుద్యోగ యువతతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు

## రేపు మద్దులమ్మ తల్లికి వరద పాశం

**కంచికచర్ల, జూన్ 07 (ప్రజాజ్యోతి)** కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామ సమీపంలో గల రిజర్వు ఫారెస్ట్ లో స్వయంభుగా వెలసి ఉన్న మద్దులమ్మ తల్లికి గొట్టుముక్కల గ్రామ ప్రజలు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వరద పాశం పోయనున్నారు. ఈ కార్యక్రమానికి పరిటాల, నక్కలం పేట, కంచికచర్ల, నరసింహారావు పాలెం గ్రామాలతో పాటు పలు గ్రామాలు ప్రజలు హాజరుకానున్నారు. వర్షప్రదాయిని అయిన మద్దులమ్మ తల్లికి వరద పాశం పోస్తే వర్షాలు పడతాయని ఇక్కడి ప్రజల నమ్మకం.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**నందిగామ, జూన్ 07 ( ప్రజాజ్యోతి)** నందిగామ పట్టణం శ్రీకరం కళ్యాణ మండపం లో చెరువుకోమ్ముపాలెం గ్రామానికి చెందిన ఇందూరి అమిరిరెడ్డి కుమారుడు గౌతమ్ రెడ్డి వివాహానికి నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకుల తో కలిసి హాజరై వధూవరులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు.

## బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకున్న ముస్లిం సోదరులు

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారాలు బక్రీద్ వేడుకలు...**



**బాపట్ల జూన్ 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకున్నారు. ప్రార్థనలు, త్యాగాలకు గుర్తుగా జరుపుకునే ఈ పండుగను ముస్లింలు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బక్రీద్ ప్రార్థనలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్‌గాహ్‌లు ప్రజలతో కిటకిటలాడాయి. ఉదయం వందలాదిమంది ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో ఒకే చోట చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతిభద్రతల పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా ప్రతి చోట పరిశీలన చేపట్టి డేగ కన్నుతో భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసు శాఖ అధికారులు మాస్టర్ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షణ నిర్వహించారు. పోలీసుల చాకచక్యంతో పండుగ క్రమశిక్షణతో కొనసాగింది. మత సౌభ్రాత్రతకు ఇది మచ్చుతునకగా నిలిచింది. జిల్లా ప్రజల సహకారంతో ఈద్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

## టిడిపి నాయకుడు సుధాకర్ గుండెపోటుతో మృతి

**బద్వేల్ జూన్ 7 (ప్రజా జ్యోతిన్యూస్)** బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ గుర్రప్పగారిపల్లి కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి సుబ్బారావు సోదరుడు తిరుమల శెట్టి సుధాకర్ గుండెపోటుతో మరణించారు, సుధాకర్ మరణ వార్త తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్-చార్జ్ రితేష్ రెడ్డి గారు గుర్రప్పగారిపల్లెకు వెళ్లి సుధాకర్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెబుతూ సుధాకర్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మసీదు మరమ్మత్తులకు
# మంత్రి సుభాష్ లక్ష రూపాయలు ఆర్థిక సాయం




– ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండ దండ
– దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన మంత్రి తండ్రి సత్యం

**కోనసీమ జిల్లా జూన్ 07:** త్యాగం, భక్తి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్ పండుగ ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. బక్రీద్ మహా పర్వదినంను పురస్కరించుకొని
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ శివారు వెలంపాలెం షాబాజియ మజీద్ ను శనివారం అయన సందర్శించి వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీద్ మరమత్తుల నిమిత్తం ఇటీవల మంత్రి సుభాష్ గారు తన వ్యక్తిగత నిధుల నుంచి లక్ష రూపాయలు వెచ్చించిన సంగతి తెలిసిందే. విజయవంతంగా మరమ్మత్తు పనులు పూర్తవ్వటం, బక్రీద్ పండుగ కావడంతో ముస్లింలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వాసంశెట్టి సత్యంని షాబాజియ మసీదులో కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ముస్లిం సమాజానికి బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింల సంక్షేమం కోసం మంత్రి సుభాష్, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమాజంలో అన్ని వర్గాల, మతాల ప్రజలు సుఖ సంతోషాలతో, ఐకమత్యంతో, సోదర భావంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా
# వివిధ బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సత్తి




**తూర్పుగోదావరి జిల్లా జూన్ 07:** అనపర్తి మండలం అనపర్తి కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీమతి సత్తి పద్మావతి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన కర్రి నర్సిరెడ్డి భార్య శ్రీమతి కుమారి ఇటీవల మరణించారు. వార కుటుంబ సభ్యులను, పెదపూడి మండలం కడకుదురు గ్రామానికి చెందిన సోడజాజుల జార్జి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను, ఇదే మండలంలోవేంద్ర గ్రామానికి చెందిన గండేటి ముసలయ్య ఇటీవల మరణించారు.వారి కుటుంబ సభ్యులను, ఇదే మండలంలో పైన గ్రామానికి చెందిన తంగేటి దుర్గారావు తండ్రి అనారోగ్యానికి గురయ్యారు. పాలిక మెహర్ బాబా ఇటీవల మరణించారు..
వారి వారి కుటుంబ సభ్యులను,
పరామర్శించిన అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త , మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి వారితో పాటు సత్తి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, సత్తి గంగిరెడ్డి, సత్తి రామారెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, తొండాపు తాతారెడ్డి, గొల్లపల్లి రాంబాబు, పోతుల ప్రసాదరెడ్డి(బుజ్జి)(బిక్కవోలు మండల కన్వీనర్), తొండాపు కాశీ విశ్వనాథ్ రెడ్డి,వాసంశెట్టి మాధవ (జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ) , ఏలేటి రాజు, ముప్పిడి సత్యనారాయణ, సిక్కాల శ్రీను, దున్న సత్తిబాబు, సోడ జాజుల రాజు, సోడ జాజుల చిట్టి, నూతన్ రాజు, సాంబత్తుల మనోహర్, సుందరంపల్లి వీరభద్రం (పైన గ్రామ సర్పంచ్), పంపన నాగరాజు, కట్టా వెంకటరమణ (గ్రామ కన్వీనర్), సోడ సుబ్రహ్మణ్యం, సుందరంపల్లి సుధాకర్ (రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యులు), విత్తనాల సత్తిబాబు, దంగేటి వెంకట ప్రసాద్, పిల్లి వెంకటస్వామి, గుత్తుల వెంకట్రావు, సుందరంపల్లి వీర్రాజు, పాలిక దుర్గాప్రసాద్, పెంకె వెంకటరమణ,కోసూరి శ్రీనివాస్ (వేంద్ర గ్రామ సర్పంచ్), కోసూరి సూరిబాబు, మోర్తా శ్రీను (వైయస్ఆర్‌సీపీ పార్టీ పెదపూడి మండలంఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు),p . రాజబాబు, అంబటి చంటి, రొక్కల సత్తిబాబు, దారా దొరబాబు, మందపల్లి సామేలు (వార్డు సభ్యులు) తదితరులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైయస్ఆర్‌సీపీ) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాన్నను ఎప్పటికీ మరువలేను

తన తండ్రి కొండన్న జయంతి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత కొండన్న ఘాట్ వద్ద ఘనంగా నివాళులు... అన్నదాన కార్యక్రమం




**అనంతపురం జూన్ 7:** నా చేయిపట్టుకుని నడిపించి.. నా జీవన ప్రయాణంలో ఎన్నో కష్టాల్లో తోడున్న నా తండ్రి ధర్మవరపు కొండన్నను ఎప్పటికీ మరువలేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో కొండన్న జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా తన తల్లి, సోదరుడు, ఇతర కుటుంబసభ్యులతో కలిసి కొండన్న ఘాట్ వద్ద పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తన తండ్రితో ఉన్న అనుబంధం గురించి నెమరువేసుకున్నారు. ఒకప్పుడు చేయి పట్టి బడికి పంపించి.. పెళ్లి చేసి, భర్త మరణంతో దుఃఖసాగరంలో ఉన్నప్పుడు చేయి పట్టి నిలబెట్టి.. అనుక్షణం నా వెంట ఉన్న వ్యక్తి నా తండ్రి అన్నారు. నా కష్ట సుఖాల్లో ఎప్పుడూ తోడుగా ఉన్నారన్నారు. తండ్రి మరణం అందరిబిడ్డల్లాగే నాకు కూడా తీరని లోటని.. ఆయన్ని ఎప్పటికీ మరువలేనని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## బక్రీద్ వేళ జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

– జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురం జూన్ 7:** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోబక్రీద్ పండుగ




పురస్కరించుకుని అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుని ఎటువంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల జారీ చేశారు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఈరోజు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, ఆయా పరిసరాల్లో పోలీసులు నిఘా పెంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు.అనుమానాస్పద వ్యక్తులు ఆయా పరిసరాలలో సంచరించకుండా మరియు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. బక్రీద్ సందర్భంగా ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సులభతరం చేశారు

## బాలికపై అత్యాచారం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలి

– ఎస్పీని కోరిన సాకే హరి



**అనంతపురం జూన్ 7:** దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు.శుక్రవారం ధర్మవరం పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో అత్యాచారానికి గురైన బాలిక బంధువులతో కలిసి ఎస్పి రత్న గారిని సాకే హరి కలిశారు.ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. మైనర్ బాలికపై జరిగిన దారుణం చాలా ఘోరమైనదని దీనికి బాధ్యులైన వారిపై చట్టపరంగా శిక్షించాలని కోరారు.పేదరికం,అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళితులనే చిన్న చూపులో భాగంగానే ఈ దురాగతం చోటు చేసుకుందని మీరే మాకు రక్షణ కల్పించాలన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా మైనర్ బాలికపై బలవంతపు అత్యాచారం జరిగిందని నిందితులంతా పథకం ప్రకారమే చేయడం దుర్మార్గమన్నారు.దళిత మహిళ హోం మంత్రి కూడా మహిళలు,బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఘోరం తెలిసిన గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించడం తోపాటు బాలికను తల్లిని క్షేమంగా అదుపులోకి తీసుకోన్న పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ సాకే వినయ్ కుమార్, సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు. ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ మంజుల నరేంద్ర ,జేఏసీ నాయకులు రామకృష్ణ, గోపాల్,రాకెట్ల సూర్యనారాయణ ,ముత్యాలప్ప, బాలిక బంధువులు పాల్గొన్నారు.

## యోగాసనాలు క్రమ
# పద్ధతిలో చేస్తే ఆరోగ్యంగా ఉంటారు.

– జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ




**అనంతపురం జూన్ 7:** యోగాసనాలు క్రమ పద్ధతిలో చేస్తే మన ఆరోగ్యం మెరుగుపడుతుందని జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. శనివారం ఉదయం యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా అనంతపురం పట్టణం బళ్ళారి రోడ్డు ఎం వై ఆర్ కళ్యాణమండపంలో జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయ గిరిజమ్మ జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ యోగాసనాలు, మన సంస్కృతి సాంప్రదాయాల గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్నారు. డిఎం అండ్ హెచ్ ఓ ఈబి దేవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన సంతోషంగా ఆరోగ్యంగా ఉంటూ హాస్పిటల్ వెళ్లే పని తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నకు తప్పకుండా హాజరు హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గారి ఆదేశం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. దైనందిక కార్యక్రమాల్లో భాగంగా ప్రతిరోజు 45 నిమిషాలు యోగా మెడిటేషన్ కు కేటాయించి యోగాసనాలు మెడిటేషన్ చేయడం వలన మిగిలిన టైం రోజంతా సంతోషంగా ప్రశాంతతతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, డి ఎం అండ్ హెచ్ ఓ డా. ఈబీదేవి, డిపిఓ నాగరాజు, డిఐపిఆర్ఓ పి. గురుస్వామి శెట్టి, ఆయుష్ డిపార్ట్మెంట్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ లాల్య నాయక్, ఈషా ఫౌండేషన్ స్వామీజీ దక్షరి, ఈషా ఫౌండేషన్ వాలంటీర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు, అనంతపురం రూరల్ ఎంపీడీవో దివాకర్, పంచాయతీరాజ్ సిబ్బంది, సచివాలయాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం
# చేసిన నిందితులపై ఫోక్సో కేసు నమోదు చేయాలి

బాలిక కుటుంబానికి 50 లక్షలు ఎక్స్గ్రేషియా 10 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయించాలి

కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు రక్షణ కరువు శివశంకర్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు

**అనంతపురం జూన్ 7:** రామగిరి మండలం ఏడు గుర్రాల పల్లి గ్రామం లో దళిత మైనర్ బాలికపై 14 మంది యువకులు అత్యాచారం చేసి గర్భవతి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలనిశివశంకర్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు సోమవారం విద్యుత్ నగర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండ్రి లేడని ఆసరా , తల్లికి మతిస్థిమితం అనే ధైర్యం బాలిక అమాయకత్వం వీటిని అన్నిటిని ఆసరా చేసుకుని ఆ గ్రామంలోని పదుల సంఖ్యలో యువకులు ఆ పసివాళిక పట్ల ప్రవర్తించిన తీరు హేయమైన చర్య అని దాదాపు రెండు సంవత్సరాలుగా మైనర్ బాలికపై బలవంతపు అత్యాచారం చేయడానికి బట్టి చూస్తే నిందితులంతా పథకం ప్రకారమే చేయడం జరిగిందని తెలుస్తుంది రాష్ట్ర దళిత మహిళ హోం మంత్రి కూడా మహిళలు,బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు ముఖ్యంగా దళిత గిరిజనులు ఓట్లతో అఖండ మెజార్టీతో గెలిచినటువంటి ఫోటో ప్రభుత్వం తక్షణం ఇటువంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా నిందితుల్ని అరెస్టు చేసి ఉరిశిక్ష పడే విధంగా చూడాలని లేనిపక్షంలో రాష్ట్రంలో ఉన్నటువంటి దళిత గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి వీరి పట్ల తగిన శాస్త్రి చెప్పాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు.




## ముస్లింలకు బక్రీద్
# శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వేగుళ్ళ...

**కోనసీమ జిల్లా జూన్ 07:** ముస్లిం సోదర, సోదరీమణులకు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల పండుగ బక్రీద్ కాగా, త్యాగం, సహనం ఈ రెండూ బక్రీద్ పండగ ఇచ్చే సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగ జరుపుకుంటారని, త్యాగనిరతికి ఈ పండుగ నిదర్శనమన్నారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో చేసుకుంటారన్నారు. అల్లాహ్ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే కోరుకుంటున్నట్లు చెప్పారు.



# రోజూ గుప్పెడు తింటే వారంలో మ్యాజిక్ చూస్తారు



బ్లూ బెర్రీలు.. బెర్రీ జాతికి చెందిన ఈ పండ్లు చూసేందుకు ద్రాక్షలా చిన్నగా ఉండి.. తియ్యటి రుచిని కలిగి ఉంటాయి. పుష్కలమైన పోషకాలు నిండి ఉన్నందున వీటిని పోషకాలకు పవర్ హౌస్ అని కూడా చెబుతుంటారు. వీటిని ఎక్కువగా స్మూథీల్లో వేసుకొని తీసుకుంటారు. క్రమం తప్పకుండా వారం రోజుల పాటు ఈ బ్లూ బెర్రీలు తినటం వల్ల మీరు ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారని నిపుణులు చెబుతున్నారు. బ్లూబెర్రీస్ రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయ పడతాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. కడుపు చుట్టూ ఉన్న కొవ్వును, బెల్లీ ఫ్యాట్ కరిగించడానికి చక్కటి ఔషధంగా బ్లూబెర్రీస్ దోహదం చేస్తాయి. బ్లూబెర్రీస్ మూత్ర విసర్జనలో సమస్యలను తగ్గిస్తాయి. మూత్రపిండాల నుంచి విషాన్ని బయటకు పంపేందుకు దోహదం చేస్తుంది. డయాబెటీస్‌తో బాధపడుతున్నవారు బ్లూబెర్రీస్ హ్యాపీగా తినొచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇది వారిలో ఇన్సులిన్ నిరోధకతను మెరుగు చేస్తుంది. బ్లూబెర్రీస్‌లో ఉండే అధిక ఆల్కలాయిడ్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది టైప్ 2 డయాబెటీస్‌తో బాధపడేవారు తప్పక తీసుకోవాలని అంటున్నారు. ఈ పండ్లలో సమృద్ధిగా లభించే ఫైబర్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. జీర్ణ సమస్యలను నయం చేస్తుంది. కీళ్లనొప్పులు, ఆస్తమా, కడుపునొప్పి, వాంతులు వంటి సమస్యలకు కూడా బ్లూబెర్రీ చక్కటి ఔషధంగా ఉపయోగపడుతుంది. బ్లూబెర్రీస్ కండరాలను బలోపేతం చేయడానికి.. మెదడు కార్యకలాపాలను ప్రేరేపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అంతేకాదు.. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారు బ్లూబెర్రీస్ తినటంవల్ల మంచి ఫలితం ఉంటుంది. పైగా, ఇది శరీరానికి మంచి హైడ్రేషన్ అందిస్తుంది. బ్లూబెర్రీస్‌లోని విటమిన్ సీ, ఈ కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి మెరిసే.. ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తాయి. బ్లూ బెర్రీస్ మధుమేహాన్ని నివారించడమే కాకుండా చర్మాన్ని అందంగా ఉంచుతుంది. ఇందులో ఆంథోనిసైనిన్స్ అనే పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది ఫ్రీ ర్యాడికల్ డ్యామేజ్ కాకుండా కాపాడతాయి. అలాగే, కంటి చూపును కూడా మెరుగు చేస్తాయి.

# షుగర్ సమస్యతో బాధపడుతున్నారా?




డబ్ల్యూహెచ్ఓ అంచనా ప్రకారం, షుగర్ వ్యాధి భవిష్యత్తులో మరణాలకు 7వ ప్రధాన కారణం కాగలదు. దీన్ని నియంత్రించకపోతే, మూత్రపిండాల వైఫల్యం, అధిక బరువు, తక్కువ సమయంలో తీవ్ర అలసట, పక్షవాతం వంటి సమస్యలు ప్రాణానికే ప్రమాదం. చక్కెర జబ్బుకు పూర్తి చికిత్స లేదు. కానీ, మందులు వాడటం, వ్యాయామం చేయడం, యోగా చేయడం ద్వారా దీనిని అదుపులో ఉంచవచ్చు. అంతేకాదు, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే కొన్ని అద్భుతమైన మూలికలు ఉన్నాయి. ఇవి ఇన్సులిన్‌కు ప్రత్యామ్నాయంగా పని చేస్తాయి. దీనికి గుడుచి అని కూడా పేరు. ఇది చేదు రుచి కలిగి ఉంటుంది. తిప్పతీగ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఆస్తమా, జలుబు, రక్తహీనత, కామెర్లు వంటి అనేక వ్యాధులకు అమృతంలా పని చేస్తుంది. దీనిలో ఉండే హైపర్ గ్లైసెమిక్ వ్యతిరేక లక్షణాలు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఉసిరికాయ: ఆరోగ్యానికి చాలా మంచిది. చక్కెర జబ్బును నియంత్రించడంలో ఉసిరి సహాయపడుతుంది. ఉసిరిలో క్రోమియం అనే ఖనిజం ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియకు సహాయపడటమే కాకుండా, శరీరాన్ని ఇన్సులిన్‌కు మరింత సున్నితంగా మారుస్తుంది. చక్కర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి సురక్షితమైన మార్గం. పసుపు: చక్కెర జబ్బును నియంత్రించడంలో పసుపు సహాయపడుతుంది. పసుపులో కర్కుమిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది గ్లైసీమియాను తగ్గిస్తుంది. ఇందుకోసం, చక్కెర జబ్బు ఉన్నవారు ప్రతిరోజూ ఉదయం అల్పాహారంతో పాటు పసుపు పాలు తాగాలి. మునగ ఆకులు : మునగ ఆకులలో క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది రక్త చక్కెరను తగ్గించడంలో సహాయపడుతుంది. మునగ ఆకులలో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లం శరీరం చక్కెరను మెరుగ్గా ప్రాసెస్ చేయడంలో సహాయపడటమే కాకుండా, ఇన్సులిన్‌ను ప్రభావితం చేస్తుంది.

త్రికటు: ఇది మిరియాలు, పిప్పళ్ళు, పొడి అల్లం అనే మూడు మూలికలను సమాన నిష్పత్తిలో కలిపి తయారు చేస్తారు. ఈ మసాలా దినుసులలో చక్కెర జబ్బు వ్యతిరేక లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి జీవక్రియను కూడా మెరుగుపరుస్తాయి. త్రికటు చూర్ణం చక్కెర జబ్బుకు, ముఖ్యంగా టైప్ 2 జబ్బుకు ప్రయోజనకరం. త్రికటును గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం వల్ల కడుపు ఆరోగ్యం బాగుంటుంది. రక్త చక్కెర నియంత్రణలో ఉంటుంది. మంచి ప్రయోజనాల కోసం, త్రికటును గోరువెచ్చని నీటిలో కలిపి రోజుకు రెండు సార్లు ఉదయం ఖాళీ కడుపుతో, రాత్రి పడుకునే ముందు తాగాలి. వేప: వేప ఒక ఔషధ వృక్షం. పాము విషం, చక్కెర జబ్బు నివారణతో సహా అనేక వ్యాధులలో దీని ఔషధ గుణాలు ప్రయోజనకరం. వేపలో రక్త చక్కెరను నియంత్రించడంలో సహాయపడే యాంటీ-హైపర్ గ్లైసెమిక్ లక్షణాలు ఉన్నాయి.

**మణిష్ఠ:** ఇది మణిత్ అనే మొక్క వేరు. ఇది వైరస్ వ్యతిరేక, క్యాన్సర్ వ్యతిరేక, వాపు వ్యతిరేక లక్షణాలను కలిగి ఉంది. మణిష్ఠను తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, చక్కెర జబ్బు, బరువు తగ్గడం, క్యాన్సర్ వంటివి నయం కావడానికి సహాయపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మణిష్ఠలో చక్కెర జబ్బు వ్యతిరేక లక్షణాలు ఉన్నాయి. ఇవి రక్త చక్కెరను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటాయి. దీనితో పాటు, మణిష్ఠ ట్రైగ్లిజరైడ్, సీరం కొలెస్ట్రాల్‌ను కూడా నియంత్రిస్తుంది. ఇది చక్కెర జబ్బును తగ్గించడంలో సహాయపడుతుంది.

బెల్ పత్రి (మారేడు): మారేడు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, రిబోఫ్లేవిన్, కాల్షియం, పొటాషియం, ఫైబర్, విటమిన్ బి1, బి6, బి12 వంటి ముఖ్యమైన పదార్థాలు ఉన్నాయి. ఇవి అనేక రకాల వ్యాధులకు అద్భుత ఔషధం. ఇది తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల రక్త చక్కెరను నియంత్రిస్తుంది. అశ్వగంధ: అశ్వగంధ చక్కెర జబ్బు ఉన్నవారికి ఇన్సులిన్ ఉత్పత్తిని, ఇన్సులిన్ సున్నితత్వాన్ని ప్రభావితం చేయడం ద్వారా సహాయపడుతుంది. అశ్వగంధ రసం రక్త ప్రవాహంలో ఇన్సులిన్ స్రావాన్ని ప్రేరేపించడమే కాకుండా, చక్కెర స్థాయిలను కూడా తగ్గిస్తుంది. ఇది టైప్ 2 చక్కెర జబ్బు ఉన్నవారికి చాలా ప్రయోజనకరం. త్రిఫల: త్రిఫల అనేది మూడు పండ్లు లేదా మూలికలను సమాన నిష్పత్తిలో కలిపి తయారు చేసేది. ఇది ఉసిరి, బహేడ, హరాత్ కలయిక. బరువు తగ్గడం నుండి చక్కెర జబ్బు వరకు అనేక వ్యాధులకు ఇది సహాయకారి. త్రిఫల, మణిష్ఠ, గోక్షుర కాలేయం, మూత్రపిండాలకు అద్భుతమైన డిటాక్సిఫైయింగ్ మూలికలు. దాల్చినచెక్క: దాల్చినచెక్క ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచడం ద్వారా రక్త చక్కెరను తగ్గించడంలో, కణాలలోకి గ్లూకోజ్‌ను తరలించడంలో ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా చేయడంలో ఇది సహాయపడుతుంది.

# నెల రోజులు ఈ ఒక్కటి మానేస్తే చాలు!



ప్రతిరోజూ మనం తాగే టీ, కాఫీ నుండి తినే ప్రతి ఆహారం వరకు, చక్కెర ఒక భాగమైపోయింది. ఆధునిక ఆహారపు అలవాట్లలో మనం ఎక్కువగా తీసుకునే పదార్థం చక్కెర. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ, అధికంగా చక్కెర వాడితే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. చక్కెరలో అధిక కేలరీలు ఉంటాయి. ఇవి మన శరీరంలో కొవ్వు రూపంలో పేరుకుపోతాయి. ఒక నెల చక్కెరను మానేస్తే, శరీరానికి అధిక కేలరీలు చేరవు. దీంతో బరువు తగ్గడం మొదలవుతుంది. ముఖ్యంగా, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు తగ్గి, మీ శరీరం మరింత అందంగా మారుతుంది. అధిక చక్కెర వాడకం ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది చక్కెర జబ్బు వచ్చే అవకాశాన్ని పెంచుతుంది. చక్కెరను మానేసిన తర్వాత, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. దీంతో ఇన్సులిన్ సున్నితత్వం మెరుగుపడుతుంది. చక్కెర జబ్బు వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. చక్కెర తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ, ఇది త్వరగా అలసటను కూడా తెస్తుంది. ఒక నెల చక్కెరను మానేస్తే, శరీరం సహజ శక్తి వనరులైన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలపై ఆధారపడుతుంది. దీనివల్ల ఎక్కువ సేపు శక్తి ఉంటుంది. రోజంతా అలసట లేకుండా ఉత్సాహంగా ఉండగలరు. చక్కెర శరీరంలో వాపును పెంచుతుంది. దీనివల్ల మొటిమలు, దద్దుర్లు, చర్మం త్వరగా ముడతలు పడటం వంటి సమస్యలు వస్తాయి. ఒక నెల చక్కెరను తినకపోతే, చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది. అంతేకాదు, చర్మంపై నూనె ఉత్పత్తి కూడా తగ్గుతుంది. చక్కెర మెదడుకు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుంది. కానీ, ఆ తర్వాత మానసిక ఒత్తిడిని, కోపాన్ని పెంచుతుంది. చక్కెరను మానేసిన తర్వాత, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. మీ నిద్ర కూడా మెరుగుపడుతుంది. ఇది మీ మానసిక ఆరోగ్యాన్ని మరింత పెంపొందిస్తుంది. అధిక చక్కెర వాడకం రక్తపోటును పెంచుతుంది. ఒక నెల చక్కెరను మానేస్తే, రక్తపోటు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. పళ్లు పుచ్చిపోవడానికి, పళ్లలో చీము పట్టడానికి చక్కెర ప్రధాన కారణం. ఒక నెల రోజుల పాటు చక్కెరను మానేస్తే, పళ్లలో బ్యాక్టీరియా పెరుగుదల తగ్గుతుంది. పళ్ల సమస్యలు కూడా తగ్గుతాయి. ఒక నెల చక్కెరను మానేయడం వల్ల మీ శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. బరువు తగ్గడం, ఆరోగ్యకరమైన చర్మం, మంచి మానసిక స్థితి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటివి ఇందులో ఉన్నాయి. చక్కెరను మానేయడం సవాలుగా ఉన్నప్పటికీ, దాని ప్రయోజనాలు చాలా గొప్పవి. కాబట్టి, మీ ఆహారంలో సహజమైన తీపిని చేర్చుకుని, చక్కెర వినియోగాన్ని తగ్గించడానికి ప్రయత్నించండి.

# సాయంత్రం 6 గంటలలోపు డిన్నర్ చేయడం వల్ల ఇన్ని లాభాలా?



సినిమా హీరోయిన్లు, కొంతమంది సెలబ్రిటీలు సాయంత్రం 6 లోపే డిన్నర్ పూర్తి చేస్తారట. ఇలా త్వరగా డిన్నర్ పూర్తి చేయడం వల్ల తాము మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నట్లు వారే స్వయంగా వెల్లడించిన సందర్భాలు కూడా అనేకం వార్తాల్లో వింటూ ఉంటాం.. అయితే, నిజంగానే సాయంత్రం 6గంటల లోపుగా డిన్నర్ పూర్తి చేయటం వల్ల ఎలాంటి లాభాలు ఉన్నాయి..?ఆరోగ్య నిపుణులు అభిప్రాయం ప్రకారం.. సాయంత్రం 6 లేదా 7 గంటలలోపు డిన్నర్ ముగించేవారు యవ్వనంగా, ఆరోగ్యంగా ఉంటారని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే రాత్రి 6 గంటలలోపు రాత్రి భోజనం ముగించాలని నిపుణులు సూచిస్తున్నారు. సాయంత్రం 6 లోపు భోజనం చేయడం వల్ల పడుకునే లోపే ఆహారం పూర్తిగా జీర్ణం అవుతుంది. దీని వల్ల అజీర్తి, మలబద్దకం, ఉబ్బరం వంటి సమస్యలు రావు. బరువు తగ్గేందుకురాత్రిపూట త్వరగా భోజనం చేయడం వల్ల కేలరీలు ఎక్కువగా బర్న్ అవుతాయి. అదే లేటుగా తింటే కొవ్వు పేరుకుపోతుంది. ఇది బరువు పెరగడానికి కారణం అవుతుంది.నిద్రరాత్రిపూట త్వరగా భోజనం చేయడం వల్ల జీర్ణ వ్యవస్థపై భారం పడదు. దీని వల్ల శరీరానికి కావాల్సిన విశ్రాంతి లభిస్తుంది. దీంతో నిద్ర బాగా పడుతుంది. నిద్రలేమి తగ్గుతుంది. షుగర్ కంట్రోల్‌సాయంత్రం పూట త్వరగా డిన్నర్ చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. డయాబెటిస్ రిస్క్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంరాత్రిపూట తొందరగా తినడం వల్ల గుండె ఆరోగ్యంగా మారుతుంది. లేటుగా తింటే బీపీ, కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరుగుతాయి. ఇవి గుండె జబ్బులకు కారణం అవుతాయి. యాసిడ్ రిఫ్లెక్స్‌పడుకునే ముందు తినడం వల్ల ఫుడ్ సరిగా జీర్ణం అవ్వదు. దీంతో యాసిడ్ రిఫ్లెక్స్, గుండెలో మంట వంటి సమస్యలు వస్తాయి. 6లోపు డిన్నర్ చేస్తే ఈ సమస్యలు రావు. ఆకలి కంట్రోల్‌రాత్రిపూట త్వరగా తినడం వల్ల అతిగా తినడం కంట్రోల్ అవుతుంది. ఫుడ్ క్రేవింగ్స్ తగ్గుతాయి. ఆకలి కంట్రోల్ అవుతుంది. దీంతో ఓవరాల్ హెల్త్ మెరుగుపడుతుంది. మానసిక ఆరోగ్యంరాత్రిపూట త్వరగా తినడం వల్ల బాగా నిద్రపడుతుంది. దీని వల్ల శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చు.

# బిజినెస్

## జీఎస్టీ శ్లాబ్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం




మార్కెటింగ్ రంగంలోని వారికి జీఎస్టీ అంటే పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. ముఖ్యంగా వివిధ రకాల పన్నులన్నింటినీ ఒకే రకమైన పన్ను విధానంలోకి తీసుకొచ్చి వేసే పన్నును జీఎస్టీ అంటారు. దేశంలో విక్రయించే వివిధ వస్తువుల వివిధ శాతాలతో జీఎస్టీ విధిస్తారు. అయితే 12 శాతం శ్లాబ్ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జీఎస్టీలో 12 శాతం పన్ను స్లాబ్‌ను తొలగించే ప్రణాళికను జీఎస్టీ కౌన్సిల్ త్వరలో పరిశీలించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ శ్లాబ్ నాలుగు నుంచి మూడుకు తగ్గించవచ్చని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు జూన్-చివరిలో లేదా జూలైలో కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో 12 శాతం శ్లాబ్ గురించి జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన కౌన్సిల్ ఆదాయ తటస్థతను కొనసాగిస్తూ 12 శాతం స్లాబ్‌ను తొలగించడం ద్వారా రేట్లను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జీఎస్టీ విధానంలో ప్రధానంగా నాలుగు పన్ను శ్లాబులు ఉన్నాయి, 5%, 12%, 18%, 28%. అయితే దీంతో పాటు ఆభరణాలపై కూడా 3 శాతం ఉంది. చాలా మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, నిపుణులు, జీఓఎం ప్రతినిధులు 12 శాతం +కూ స్లాబ్‌ను తొలగించే ప్రణాళికను సమర్థించారు. ఈ శ్లాబ్ కిందకు వచ్చే వస్తువులను 5 శాతం లేదా 18 శాతానికికి మార్చవచ్చని నివేదికల్లో స్పష్టం అవుతుంది. ముఖ్యంగా రోజువారీగా ఉపయోగించే సామూహిక వినియోగ వస్తువులను 5 శాతం పన్ను స్లాబ్‌కి మార్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## తగ్గనున్న ఈఎంఐల భారం




ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్‌ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది. ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్‌ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది. తాజా రేట్ల తగ్గింపుతో గృహ రుణాలు 7.45 శాతం నుంచి ప్రారంభం కానుండగా వాహన రుణాలు 7.8 శాతం నుంచి మొదలవుతాయని పీఎన్‌బీ తెలిపింది. కాగా బీఓఐ కూడా తన ఆర్‌బీఎల్‌ఆర్‌ను 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించినట్లు వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఒక శాతం తగ్గించింది. ఇందులో అర శాతాన్ని ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లో, మిగతా అర శాతాన్ని శుక్రవారం తగ్గించింది. దీంతో రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. అయితే ఈ వడ్డీ రేట్ల కోతతో ఎవరికి ఎంత భారం తగ్గుతుందనేది ఆయా వ్యక్తుల రుణ కాలపరిమితి, ఈఎంఐలపై ఆధారపడి ఉంటుంది. ఒకే కాలపరిమితితో కేవలం ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే ఒక రకంగా, అదే ఈఎంఐతో కాలపరిమితి మాత్రమే తగ్గించుకుంటే వడ్డీ భారం తగ్గుతుంది. ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే: 20 ఏళ్ల కాలపరిమితితో ఒక వ్యక్తి 9.5 శాతం వడ్డీతో గృహ రుణం తీసుకుంటే, ఇప్పుడు అతను చెల్లించే వడ్డీ రేటు 8.5 శాతం. అదే కాలపరిమితితో ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే అతడికి నెలకు అదా అయ్యే ఈఎంఐ రూ.1,929. అంటే 20 ఏళ్ల కాలంలో అతడికి ఆదా అయ్యే వడ్డీ రూ.4,63 లక్షలు.

## గ్రామ స్థాయికి క్రెడిట్ అవగాహన..
# సిబిల్, సా-ధన్ కొత్త కార్యక్రమం!



దేశంలో ఆర్థిక అవగాహనను పెంచేందుకు, బాధ్యతాయుత రుణ విధానాలను ప్రోత్సహించేందుకు ఒక ముఖ్య అడుగు పడింది. క్రెడిట్ సమాచారంలో అగ్రగామి సంస్థ ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సూక్ష్మ రుణ సంస్థల అపెక్స్ బాడీ సా-ధన్ కలిసి పని చేయనున్నాయి. దేశవ్యాప్తంగా రుణాలపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా, రుణదాతలు, చిన్న మొత్తంలో అప్పు తీసుకునేవారికి ఆర్థిక విషయాలపై పట్టు పెంచడమే ఈ భాగస్వామ్యం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని ఆయా సంస్థలు ప్రకటించాయి. ఈ సహకారం వల్ల చిన్న రుణ సంస్థల రుణ మూల్యాంకనం, పర్యవేక్షణ సామర్థ్యాలు మెరుగుపడతాయి. డేటా ఆధారిత విశ్లేషణలు, అధునాతన సాధనాలు, ప్రత్యేక శిక్షణల ద్వారా చిన్న రుణ సంస్థలను బలోపేతం చేయనున్నారు. దీనివల్ల ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయి. బాధ్యతాయుతమైన రుణ పంపిణీకి ప్రోత్సాహం లభిస్తుంది. ఈ అవగాహన కార్యక్రమం దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరేలా పలు భాషల్లో డిజిటల్ సమాచారం రూపొందించారు. కమ్యూనిటీ ఆధారిత విధానాన్ని అనుసరించి, చిన్న రుణ సంస్థలు తమ ఖాతాదారులకు రుణాలపై సరైన అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. తద్వారా, బాధ్యతాయుతమైన క్రెడిట్ అలవాట్లు పెంపొందుతాయి. ఆర్థిక సేవలు తగినంతగా అందుబాటులో లేని ప్రాంతాల్లో ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న సా-ధన్ సంస్థకు 230కి పైగా సూక్ష్మ రుణ సంస్థలు, బ్యాంకులు సభ్యులుగా ఉన్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సా-ధన్ కలిసి ప్రాంతీయ, రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తాయి. క్రెడిట్ స్కోర్ ప్రాముఖ్యత, డేటా వినియోగం, పటిష్టమైన రుణ వ్యవస్థ నిర్మాణం వంటి అంశాలపై చిన్న రుణ సంస్థలకు, వారి బృందాలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా మాడ్యూల్స్ రూపొందిస్తాయి. ట్రాన్స్‌యూని యన్ సిబిల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ భవేష్ జైన్ మాట్లాడుతూ.. "రుణాలపై అవగాహన కేవలం అప్పు తీసుకోవడానికి మాత్రమే కాదు. ఆర్థిక ప్రపంచంలో నమ్మకాన్ని, విశ్వసనీయతను పెంచుకోవడానికి ఇది కీలకం. డిసెంబర్ 2024 నాటికి 13 కోట్ల మంది తమ సిబిల్ రిపోర్ట్, స్కోర్‌ను పరిశీలించారు. ఇది క్రెడిట్ గురించి ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనం. ఈ భాగస్వామ్యం ద్వారా, చిన్న రుణ సంస్థలు, వారి ఖాతాదారులకు ఆర్థికంగా మరింత మెరుగైన భవిష్యత్తును అందించాలని మేము ఆశిస్తున్నాం" అని తెలిపారు.

# వడ్డీ రేట్లు అర శాతం తగ్గింపు




రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడోసారి వడ్డీ రేట్లకు కోత విధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమీక్షలో కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా 5.50 శాతానికి చేర్చింది. ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించింది. మొత్తంగా రుణాలపై వడ్డీ ఒక్క శాతం మేర కోత విధించడంతో పాత, కొత్త గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలపై వడ్డీ భారం కొంత తగ్గనుంది. ఆర్‌బిఐ ఎంపీసీ భేటీ తర్వాత శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజరు మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణం స్థిరంగా తగ్గుతోందన్నారు. ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జీడీపీ 6.5 శాతం పెరగొచ్చన్నారు. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నామన్నారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్టు మల్హోత్రా తెలిపారు. మరోవైపు బ్యాంక్‌ల వద్ద నగదు లభ్యతను పెంచడానికి నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ను 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో సీఆర్‌ఆర్ 4 శాతం నుంచి 3 శాతనికి తగ్గనుంది. దీన్ని సెప్టెంబర్ నుంచి 25 బేసిస్ పాయింట్ల చొప్పున నాలుగు విడతలుగా అమలు చేయనున్నట్టు తెలిపింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలోకి దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు నగదు లభ్యతను పెంచనుందని అంచనా వేసింది. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్టవుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.9.5 లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చామని మల్హోత్రా తెలిపారు. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయన్నారు. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ దఫా వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపు ఉండొచ్చని నిపుణులు అంచనా వేయగా.. ఎస్‌బీఐ మాత్రం అర శాతం కోత ఉండొచ్చని ముందస్తు భావించడం విశేషం.

---

## కొత్త నాయకుడికి తొలి సవాల్..
# ఇంగ్లండ్ చేరుకున్న భారత జట్టు



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సైకిల్(2025-27) తొలి సిరీస్ కోసం భారత జట్టు ఇంగ్లండ్ చేరుకుంది. శుక్రవారం రాత్రి మీడియా సమావేశం అనంతరం హెడ్‌కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టీమిండియా బృందం ముంబైలో లండన్ విమానం ఎక్కింది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం శనివారం భారత ఆటగాళ్లు ఇంగ్లండ్‌లో అడుగుపెట్టారు. 5 టెస్టుల సిరీస్ కోసం భారత బృందం ఇంగ్లండ్‌లో కాలు మోపింది అంటూ బీసీసీఐ ఎక్స్ ఖాతాలో వీడియో పోస్ట్ చేసింది. దేశవాళీ, ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన సాయి సుదర్శన్ ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై కూడా చెలరేగి ఆడాలనుకుంటున్న ఈ చిచ్చరపిడుగు సిరీస్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. భారత జట్టులో అది కూడా టెస్టు ఆటగాడిగా ఎంపిక కావడం నిజంగా చాలా గొప్ప విషయం. లండన్‌లోకి స్వాగతం పలుకుతున్నా సుదర్శన్ బీసీసీఐ పోస్ట్ చేసిన వీడియోలో అన్నాడీ యువకెరటం. సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్‌ల గైర్హాజరీలో తొలిసారి భారత జట్టు విదేశీ పర్యటనకు వెళ్లింది. ఇక కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే మొదటి సిరీస్. సో.. నాయకుడిగా తనను తాను నిరూపించుకునేందుకు అతడికి ఇదొక అవకాశం. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లే ఆఫ్స్ తీసుకుకెళ్లిన ఈ యంగ్ కెప్టెన్.. ఇప్పుడు కోట్లాది మంది ఆశల్ని మోస్తూ ఇంగ్లండ్‌లో 'శభాష్ గిల్' అనిపించుకోవాలనే ఆలోచనతో ఉన్నాడు. అతడికి అన్నివిధాలా అండగా కోచ్ గంభీర్ ఉండనే ఉన్నాడు. వీళ్ల కాంబినేషన్‌లో భారత జట్టు సిరీస్ కైవసం చేసుకుంటుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఇంగ్లండ్, భారత జట్లకు ఇదే మొట్ట మొదటి సిరీస్. జూన్ 20 లీడ్స్ వేదికగా తొలి మ్యాచ్ జరుగనుంది. కాబట్టి.. ఇరు టీమ్‌లు విజయం కోసం గట్టిగానే పోరాడనున్నాయి. బర్మింగ్‌హామ్‌లో జూలై 2న రెండో మ్యాచ్, లార్డ్స్‌లో జూలై 10న మూడో టెస్టు, మాంచెస్టర్‌లో జూలై 23 నాలుగో మ్యాచ్, ఓవల్‌లో ఆగస్ట్ 4న ఐదో టెస్టులో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి.

## బెంగళూరు తొక్కిసలాట..
## విరాట్ కోహ్లీపై పోలీసులకు ఫిర్యాదు




ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా బెంగళూరులో బుధవారం జరిగిన తొక్కిసలాట ఘటనతో స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ చిక్కుల్లో పడ్డారు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ కోహ్లీపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి. శివమొగ్గ జిల్లాకు చెందిన హెచ్‌ఎమ్ వెంకటేశ్ అనే వ్యక్తి కబ్బన్ పోలీసు స్టేషన్‌లో కోహ్లీపై ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే రిజిస్టరైన కేసులో భాగంగా ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 18 ఏండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పును ముద్దాడింది. ఈ సందర్భంగా బుధవారం బెంగళూరులో ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 47 మందికిపైగా గాయపడ్డారు. ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడైన విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ArrestKohliని నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.

# స్పోర్ట్స్

## జోస్ బట్లర్ విధ్వంసం..
## విండీస్‌ను చిత్తు చేసిన ఇంగ్లండ్




వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. చెస్టర్-లె-స్ట్రీట్ వేదికగా జరిగిన తొలి టీ20లో 21 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లీష్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన బట్లర్.. విండీస్ బౌలర్లను ఊతికారేశాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 59 బంతులు మాత్రమే ఎదుర్కొన్న బట్లర్.. 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 96 పరుగులు చేశాడు. అతడితో పాటు యువ ఓపెనర్ జేమీ స్మిత్(38), జాకబ్ బెతల్(23) రాణించారు. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టగా.. జోషఫ్, రస్సెల్, ఛేజ్ తలా వికెట్ సాధించారు.

**తిప్పేసిన డాసన్..**

అనంతరం లక్ష్య చేధనలో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 167 పరుగులకే పరిమితమైంది. ఇంగ్లండ్ స్పిన్నర్ లియాస్ డాసన్ ధాటికి కరేబియన్ బ్యాటర్లు విల్లవిల్లాడారు. డాసన్ నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును దెబ్బతీశాడు. అతడితో పాటు జాకబ్ బెతల్, మాథ్యూ పాట్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక విండీస్ ఇన్నింగ్స్‌లో ఎవిన్ లూయిస్(39) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 బ్రిస్టల్ వేదికగా ఆదివారం జరగనుంది.



## ఘట్టమేని ఫ్యామిలీ నుంచి మరో హీరో... మహేశ్ బాబు భారీ స్కెచ్!

టాలీవుడ్‌లో ఘట్టమనేని ఫ్యామిలీకి మంచి గుర్తింపు ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమలో సాహసానికి, మంచితనానికి కేరాఫ్‌గా నిలిచారు సూపర్‌స్టార్ కృష్ణ ఈ ప్యామిలీ నుంచి వచ్చిన వాడే. ఆ తర్వాత కృష్ణ వారసుడిగా మహేశ్ బాబు హీరో అయ్యాడు. తనదైన శైలీలో సినిమాలు చేస్తూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగాడు. ఇప్పుడు ఘట్టమేని ఫ్యామిలీ నుంచి మూడో తరం హీరో రాబోతున్నాడు. సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ మనవడు, మహేశ్ అన్నయ్య రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ కొత్త ప్రాజెక్టును దర్శకుడు అజయ్ భూపతి స్వయంగా హెల్మ్ చేయనున్నారని తాజా సమాచారం. %=శ% 100 వంటి బ్లాక్‌బస్టర్‌తో తన ప్రతిభను చాటిన అజయ్ భూపతి, ఇటీవల థ్రిల్లర్ "మంగళవరం"తో మళ్ళీ ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం "మంగళవరం 2" ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉండగానే, మరో హై-ప్రొఫైల్ లాంచింగ్ ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఈ సినిమా ద్వారా జయకృష్ణ వెండితెరకు పరిచయమవుతున్నాడు. ఈ చిత్రానికి ఇద్దరు ప్రముఖ నిర్మాతలు మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. భారీ బడ్జెట్ కేటాయించి వైజయంతి ఆర్ట్స్, అనంది ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ పై ఈ సినిమాను రూపొందించనున్నారట. ఈ సినిమాకు సంబంధించిన కథ, నటీనటులు, షూటింగ్ షెడ్యూల్ వివరాలు ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. అయినప్పటికీ, సూపర్ స్టార్ ఫ్యామిలీ నుంచి మరో హీరో వస్తున్నారని తెలియడంతో చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. జయకృష్ణ ప్రస్తుతం లండన్‌లో ప్రొఫెషనల్ నటనా శిక్షణ తీసుకుంటున్నాడని సమాచారం. సోషల్ మీడియాలో ఇటీవల బయటకు వచ్చిన ఫోటోల ద్వారా అతని లుక్ పై కూడా జనాల్లో ఆసక్తి పెరిగింది. ఇక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాజెక్ట్‌ను జయకృష్ణ బాబాయి, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మంచి లాంచ్ కోసం అవసరమైన నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలపై మహేష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు టాక్. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



## ఎర్రచీరలో మెరిసిపోతున్న అదితి రావు హైదరి



## ప్రేమంటే గమ్యం కాదు.. ప్రయాణం.. '8 వసంతాలు' నుంచి కొత్త టీజర్

టాలీవుడ్ యువ దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం '8 వసంతాలు' దాదాపు 7 సంవత్సరాల తర్వాత మెగాఫోన్ పట్టిన ఈ దర్శకుడు ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాను టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తుండగా.. ఈ సినిమాలో మ్యాడ్ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అనంతిక సనిల్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా మరో అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త టీజర్‌ను పంచుకుంది. ఫస్ట్ టీజర్‌లో కథానాయికను పరిచయం చేసిన టీమ్.. రెండో టీజర్‌లో హీరో పాత్రను పరిచయం చేసింది. మధురం అనే షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు తెచ్చుకున్న రవి తేజ దుగ్గిరాల ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. 'ఊటీకి కొత్తగా వచ్చిన తెలుగు రచయిత అతడు. తను పదాలను ప్రేమతో రాస్తే తడిసిన గులాబీ పూలలా ఉంటాయి. అదే కసితో రాస్తే, పిన్ పీకిన గ్రనేడ్‌లా ఉంటాయి' అంటూ మొదలైన టీజర్ ప్రేమ కవిత్వంతో పొంగిపోయేలా ఉంది. 'ప్రేమంటే మనం చేరాల్సిన గమ్యం కాదు.. చేయాల్సిన ప్రయాణం' అంటూ హీరో చెప్పిన డైలాగ్ అకట్టుకుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ టీజర్‌ను మీరు చూసేయండి.

## ఉత్కంఠగా ఆది సాయికుమార్ 'శంబాల' టీజర్

టాలీవుడ్ యువ కథానాయకుడు ఆది సాయికుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్' యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్‌లో అర్చన అయ్యర్, స్వాసిక్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. సైన్స్‌కు సమాధానం దొరకనప్పుడు వాటిని మూఢనమ్మకం అంటుంది. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పతనం అంటుంది అనే డైలాగ్‌తో ఈ టీజర్ స్టార్ట్ అవుతుంది. అనంతరం ఆకాశం నుంచి ఒక ఉల్క లాంటి రాయి కిందికి వచ్చి ఒక ఊరిలో పడుతుంది. అయితే అది పడిన తర్వాత నుంచి ఆ ఊరిలో ప్రజలు వింతగా ప్రవర్తిస్తుంటారు. అయితే దాని వెనుక ఉన్న రహస్యం ఏంటీ అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఆది సాయికుమార్ ఈ చిత్రంలో భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు.




## అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ..

'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్ ఏ సినిమా చేస్తాడా అని ఎదురుచూసిన అభిమానులకు.. కొన్నిరోజుల క్రితం సమాధానమిచ్చేశాడు. తమిళ దర్శకుడు అట్లీతో భారీ పాన్ ఇండియా మూవీ చేయబోతున్నట్లు అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్ చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తున్న నేపథ్యంలో పలు రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ నిర్మాణ సంస్థ నుంచి అధికారికంగా ఓ అప్‌డేట్ వచ్చేసింది. హీరోయిన్ ఎవరనేది ప్రకటించారు. ప్రభాల్ 'కల్కి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన దీపికా పదుకొణెని అల్లు అర్జున్‌కి జోడీగా ఎంపిక చేశారు. బన్నీకి ఈమెతో పనిచేయడం తొలిసారే. కానీ దర్శకుడు అట్లీ మాత్రం తన గత చిత్రం 'జవాన్'లో దీపికతో కలిసి పనిచేశాడు. ఇప్పుడు బన్నీతో చేయబోయే మూవీలోనూ ఈమెని హీరోయిన్‌గా ఎంపిక చేశాడు. ఈ మేరకు ఓ వీడియోని రిలీజ్ చేశారు. గత కొన్నిరోజుల నుంచి దీపికా పదుకొణె వార్తల్లో నిలుస్తోంది. 'స్పిరిట్' కోసం సందీప్ రెడ్డి వంగా ఈమెని అప్రోచ్ అయ్యాడు. దాదాపు సెట్ అనుకునే టైంలో ప్రాజెక్ట్ నుంచి దీపిక బయటకొచ్చింది. ఈ క్రమంలోనే స్టోరీని లీక్ చేయడం లాంటివి జరిగేసరికి సందీప్ వంగా.. ఈమె పేరు చెప్పకుండా పరోక్షంగా ట్వీట్ పెట్టాడు. మరోవైపు 8 గంటల షిఫ్ట్ కారణంగా 'కల్కి 2' నుంచి కూడా ఈమె తప్పుకోనుందనే రూమర్స్ వస్తున్నాయి. ఇలా కాంట్రవర్సీ పుకార్లకు కేరాఫ్ అయిన దీపిక.. బన్నీ-అట్లీ మూవీ విషయంలో ఏం చేస్తుందో చూడాలి? దీపిక స్వతహాగా కన్నడ అమ్మాయి అయినప్పటికీ.. కెరీర్ ప్రారంభం నుంచి హిందీలోనే సినిమాలు చేస్తూ వచ్చింది. పద్మావత్, రామ్ లీలా తదితర చిత్రాలు ఈమె చాలా గుర్తింపు తీసుకొచ్చాయి. ఇక తనతో పాటు కలిసి సినిమాలు చేసిన రణ్‌వీర్ సింగ్ ని ఈమె పెళ్లి చేసుకుంది. కొన్నాళ్లకు వీళ్లకు ఓ కూతురు కూడా పుట్టింది. మధ్యలో కాస్త బ్రేక్ తీసుకుంది కానీ ఇప్పుడు మళ్లీ బిజీ కానుంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com